ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
సోమవారం 25 మార్చి 2024



ఆంధ్రజ్యోతి బ్రహ్మోత్సవం 6వ రోజు

గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిస్తున్న నృసింహుడు

గరుడ గమనా.. పాహిమాం

వైభవంగా ఖాద్రీశుడి గరుడ వాహనోత్సవం

వేలాదిగా తరలివచ్చిన భక్తులు

కదిరి, మార్చి 24: పట్టణంలో వెలసిన ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఇష్ట వాహనమైన గరుడుడిపై విహరిస్తూ.. భక్తులకు దర్శనమిచ్చారు. బ్రహ్మోత్సవాల్లో అత్యంత ప్రాముఖ్యత కలిగిన బ్రహ్మగరుడ సేవ ఆదివారం అత్యంత వైభవంగా సాగింది. యాగశాలలోని శ్రీవారికి ఉదయం నిత్యపూజలు చేశారు. అనంతరం తిరువీధుల్లో విహరించారు. సంధ్యాసమయంలో శ్రీవారు గరుడారూడుడై తిరుమాడవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. అంతకుముందు గరుడ పూజను వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉత్సవానికి నారసింహుడి భక్తులు అత్యంత ప్రాధాన్యత ఇస్తారు. ఉత్సవాలకు అధిపతి అయిన బ్రహ్మదేవుడు తన ఇష్టవాహనమైన గరుత్మంతుడిని నారసింహుడికి వాహనంగా పంపుతారని, గరుడుడిపై కొలువుదీరిన శ్రీవారిని తూర్పురాజగోపురంలో దర్శించుకుంటే మోక్షం ప్రాప్తిస్తుందని భక్తుల నమ్మకం. ఒక్క బ్రహ్మోత్సవాల్లోనే బ్రహ్మగరుడ సేవను నిర్వహిస్తారు. అందుకే శ్రీవారి దర్శనభాగ్యం కోసం వేలాదిగా భక్తులు తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం, తిరువీధులు కిక్కిరిసిపోయాయి. శ్రీవారికి ముందు భాగంలో జానపద కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఆనవాయితీ ప్రకారం స్థానిక మరకత మహాలక్ష్మి ఆలయం వారు శ్రీవారికి పట్టువస్త్రాలను సమర్పించారు.

నేడు కదిరి పున్నమి

కదిరి పున్నమిగా పేరొందిన పౌర్ణమి రోజున శ్రీవారి ఆలయానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తారు. ఉదయం నుంచి ఉపవాసం ఉండి మొక్కులను తీర్చుకుంటారు. కర్ణాటక, హిందూపురం, మదనపల్లి, తిరుపతి, రాయచోటి, పులివెందుల ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి స్వామి వారిని దర్శించుకుంటారు.

నేడు శేషవాహన సేవ

ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీవారు శేషవాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఈ ఉత్సవానికి ఎనలేని ప్రాముఖ్యత ఉంది. బ్రహ్మోత్సవాల్లో అన్ని ఉత్సవాల్లో శ్రీవారు మాత్రమే తిరువీధుల్లో భక్తులకు దర్శనమిస్తారు. శేషవాహనంపై శ్రీదేవి, భూదేవి సమేతుడై స్వామివారు తిరువీధుల్లో విహరిస్తారు.



శ్రీవారి దర్శనానికి విచ్చేసిన భక్తులు



అగ్రనేతల హామీలు, బుజ్జగింపుల పర్వం
ఫలించని ప్రయత్నాలు..
అధికార పార్టీలో అయోమయం



వైసీపీలో కట్టప్పలు!

అధికార పార్టీలో అసంతుష్టులు రగిలిపోతున్నారు. ఎన్నికల్లో వీరు ఎంతవరకు సహకరిస్తారన్నది ప్రశ్నార్థకం. కట్టప్పలు ఎవరో తెలియక మల్లగుల్లాలు పడుతున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ అసంతృప్తితో రగిలిపోతున్న వారిని బుజ్జగించే చర్యలు ముమ్మరమయ్యాయి. జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో విజయబావుటా ఎగురవేయాలని ప్రధాన పార్టీలున్నాయి. ఈ క్రమంలో అధికార పార్టీకి ప్రతికూలతలు వెంటాడుతున్నాయి. అధికార పార్టీకి ప్రజావ్యతిరేకత ఒకవైపు, అంతర్గతపోరు మరోవైపు అభ్యర్థులకు సవాల్‌గా మారింది. ఇప్పటికే వైసీపీ నేతలు తాయిలాలతో ఓటర్లను, కీలకవర్గాలను ప్రసన్నం చేసుకునే పనిలో పోటీ పడుతున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులు ఆయాపార్టీలు ఇంటిపోరును చక్కదిద్దుకుని ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు క్షేత్రస్థాయిలోకి ఉమ్మడిగా కదిలిపోతున్నారు. - హిందూపురం



అభ్యర్థులను వెంటాడుతున్న అసంతుష్టుల భయం



● మడకశిరలో..

సిట్టింగ్ ఎమ్మెల్యే డా.తిప్పేస్వామిని కాదని మరొకరికి ఇక్కడ వైసీపీ టిక్కెట్ ఇచ్చారు. టిక్కెట్ ఇచ్చిన నేత బలమైనవాడు కాకపోవడంతో ఇప్పటికీ ఎమ్మెల్యే తనవర్గాన్ని తన చెప్పుచేతుల్లో పెట్టుకుంటున్నాడు. స్థానిక ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే హయాంలో పదవులు పొందినవారు కావడంతో అధిక శాతం మంది ఎమ్మెల్యే మాటపైనే ఉన్నట్లు అధికార పార్టీవర్గాల ద్వారా తెలుస్తోంది. ముఖ్య నేతలు వీరిరువురిని కలిపేందుకు ప్రయత్నించినా పెద్దగా సహకరించలేదన్నది తేటతెల్లమవుతోంది. అందుకే మడకశిరలో ఇప్పటికీ ప్రచారహోరు అంతంతమాత్రమేనని తెలుస్తోంది. ఇప్పటికీ కొంత మంది ప్రస్తుత అభ్యర్థికి వ్యతిరేకంగానే పనిచేయాలని పావులు కదుపుతున్నారు. ఎమ్మెల్యే వర్గీయులు కొంత మంది ప్రస్తుత అభ్యర్థివైపు వచ్చినా వారు ఎంతమేర పనిచేస్తారన్నది ప్రశ్నార్థకం.

కలిసినట్టే ఉన్నా...

హిందూపురంలో ఇటీవల అందరూ కలిసినట్లే కనిపిస్తున్నా లోలోపల అధికార పార్టీలో కట్టప్పలు చాలామంది ఉన్నారని ఆ పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. చిలమత్తూరు మండల ప్రచారంలో కొంతమంది స్థానిక ప్రజాప్రతినిధులు డుమ్మాకొట్టడమే ఇందుకు నిదర్శనం. నియోజకవర్గ నేతల తీరుపై స్థానిక నాయకులు అసంతృప్తిగా ఉన్నట్లు సమాచారం. హిందూపురం పట్టణంలో కూడా అధికార పార్టీ అభ్యర్థి దీపిక వర్గం వెంట వెళ్తున్నా.. వెనుక మాత్రం గొయ్యిలు తవ్వేవారు చాలామంది ఉన్నారని ఆ వర్గం నాయకులే చెప్పుకుంటున్నారు.

● కావాలన్న వారే వ్యతిరేకిస్తున్నారు..



పెనుకొండ సిట్టింగ్ ఎమ్మెల్యే శంకర్‌నారాయణ నాలుగేళ్లుగా వద్దంటూ నిరసనలు, ర్యాలీలు చేసిన అప్పటి అసమ్మతి నాయకులు మంత్రి ఉషశ్రీ వచ్చినపుడు స్వాగతించారు. ఆ ఎమ్మెల్యే కంటే ఈ మంత్రి.. కార్యకర్తలను ఏమాత్రం పట్టించుకునే పరిస్థితిలో లేరని శ్రేణులకు అర్థమవడానికి ఎంతో సమయం పట్టలేదు. ఆమె హంగు ఆర్భాటంతో పల్లెల్లోకి వెళ్తున్నారనీ, కనీసం పార్టీ ఆవిర్భావం నుంచి వున్న నాయకులను సైతం పట్టించుకోలేదంటూ కొంతమంది ముఖ్యనేతలు వాపోతున్నారు. ఈ పరిస్థితుల్లో శంకర్‌నారాయణకు అనుకూలంగా ఉన్న కొంత మంది మంత్రి వైపు వెళ్లినా మెజార్టీ వర్గం ఆమెను వ్యతిరేకిస్తున్నారు. దీంతో ఆమె తీరు నచ్చక నియోజకవర్గంలో చాలామంది తెలుగుదేశం పార్టీకి క్యూ కడుతున్నారని అధికార పార్టీ వర్గాలే పేర్కొంటున్నాయి. ఇదే పరిస్థితుల్లో నియోజకవర్గంలోని కొంతమంది ముఖ్యనేతలు మంత్రి పెద్దిరెడ్డి వద్దకెళ్లి, ప్రస్తుత అభ్యర్థిపై ఫిర్యాదు చేశారు. ఈమె పరిస్థితి ఇలాగే ఉంటే గెలవడం కష్టమంటూ పెద్దిరెడ్డి వద్ద కరాఖండిగా చెప్పినట్లు సమాచారం. ఆమె గతంలో ప్రాతినిధ్యం వహించిన నియోజకవర్గం నుంచి మూడు, నాలుగు వర్గాలవారు వారి బంధుత్వం ఉన్నవారికి అక్కడ ఆ మంత్రి చేసిన పనులు, సొంతపార్టీ వారిని ఇబ్బంది పెట్టిన తీరును తెలియజేస్తూ కొన్ని వీడియోలు కూడా పెనుకొండ నియోజకవర్గానికి పంపుతున్నారు.

● సొంత మనుషులే వ్యతిరేకులయ్యారు..



పుట్టపర్తి నియోజకవర్గంలో చూస్తే అధికార పార్టీలో సిట్టింగ్ ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డికే మరోసారి టిక్కెట్ ఇవ్వడంతో అసంతృప్తి జ్వాలలు చెలరేగాయి. ఎమ్మెల్యే సొంత సామాజిక వర్గానికి చెందిన నేతలతోపాటు సొంత మనుషులే వ్యతిరేకిస్తున్నారు. ఐదేళ్లలో నియోజకవర్గంలో సదరు ప్రజాప్రతినిధి చేసిన పనులేమిటో ఎత్తి చూపుతున్నారు. సొంత పార్టీ నాయకులపై పెట్టిన కేసులను ఏకరవు పెడుతున్నారు. సొంత మనుషులకే ఈ ఐదేళ్లలో పెట్టిన ఇబ్బందులను గుర్తుచేసుకుంటున్నారు. ఆయనకు టిక్కెట్ ఇవ్వకూడదని పలుసార్లు సొంత పార్టీ నేతలే అధిష్ఠానం వద్దకు వెళ్లారు. అయినా టిక్కెట్ రావడంతో ఆయన వద్ద 23 ఏళ్లు పనిచేసిన ఒక కార్యకర్త అరగుండు, అరమీసంతో నిరసన తెలిపిన విషయం తెలిసిందే. ఇక్కడ కూడా అధికార పార్టీలో కట్టప్పలు చాలా మంది ఉన్నారు.

● కుదరని సయోధ్య



కదిరి నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే సిద్దారెడ్డిని కాదని మైనార్టీ నాయకుడు మగ్బూల్‌కు టిక్కెట్ ఇచ్చారు. ఇక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యే సామాజికవర్గం.. ప్రస్తుత అభ్యర్థిని వ్యతిరేకిస్తోంది. అధిష్ఠానంపై గుర్రుగా ఉంది. ఇప్పటికీ ఎమ్మెల్యే వర్గం ప్రస్తుత అభ్యర్థి వర్గానికి దూరంగా ఉండడం గమనార్హం. కొంతమంది నాయకులైతే ప్రత్యక్షంగానే ఓడిస్తామని పేర్కొంటున్నారు. ఇటీవల వారిని కలపడానికి ముఖ్య నేతలు ప్రయత్నించినా విఫలమైనట్లు సమాచారం. ఈ పరిస్థితుల్లో కొంతమంది ఎమ్మెల్యే వర్గీయులు అభ్యర్థి వెంట ఉన్నా.. కొందరు కోవర్టులున్నారని స్థానికంగా ప్రచారం సాగుతోంది. దీంతో ఇప్పటికీ అధికార పార్టీలో ఈ నియోజకవర్గంలో సయోధ్య కుదరలేదు.



లోలోపలే రగులుతున్న నేతలు

ధర్మవరంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డికి వ్యతిరేకంగా బహిరంగంగా రాకపోయినా చాలా మంది ఆయనను లోలోపలే వ్యతిరేకిస్తున్నారు. బయటకు వచ్చి నిరసన తెలిపితే ఇబ్బందులలు పెడతారేనని లోలోపలే మదన పడుతున్నారు. కొంతమంది నాయకులు.. ఎమ్మెల్యేపై అధిష్ఠానానికి ఫిర్యాదు చేసినా ఆ విషయం బయటకు చెప్పకూడదంటూ వేడుకున్నట్లు సమాచారం. ఈ ఎన్నికల్లో వారు ఎంత మేర ఎమ్మెల్యే అభ్యర్థికి పని చేస్తారో వేచిచూడాల్సిందే.

అగ్రనేతల బుజ్జగింపుల పర్వం

వైసీపీలో అసమ్మతిని చల్లార్చేందుకు అగ్రనేతలు బుజ్జగింపుల పర్వానికి తెరలేపారు. నియోజకవర్గాల్లోని అసమ్మతి నేతలను పిలిపించుకుని మాట్లాడుతున్నారు. అక్కడ కూడా వారు అసమ్మతి గళం వినిపిస్తున్నారు. కొందరు ముఖ్య నేతలు పిలిచినా.. వెళ్లట్లేదు. తాము రామంటూ తెగేసి చెబుతున్నారు. చేసేదిలేక ముఖ్య నేతలే.. నియోజకవర్గాలకు వస్తున్నారు. వారు వచ్చే సమయానికి అసమ్మతి నేతలు ముఖం చాటేస్తున్నారు. నియోజకవర్గంలో అందుబాటులో ఉండకుండా ఇతర ప్రాంతాలకు వెళ్లిపోతున్నారు. దీంతో అగ్రనేతలు ఉసూరుమంటూ వెనుదిరిగుతున్నారు. కొందరిని ఎంత బుజ్జగిస్తున్నా.. అభ్యర్థికి మద్దతుగా పనిచేసేందుకు ససేమిరా అంటున్నారు. పనిచేసేది లేదంటూ తెగేసి చెబుతున్నారు. దీంతో అగ్రనేతలు అయోమయంలో పడ్డారు.



కార్యకర్తలు సైనికుల్లా పోరాడాలి

హిందూపురం ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి

సమావేశంలో మాట్లాడుతున్న బీకే పార్థసారథి



పెనుకొండ, మార్చి 24: జగన్ రాక్షస పాలనను అంతమొందించడానికి ప్రతి కార్యకర్త రాబోయే ఎన్నికల్లో సైనికుడిలా పోరాటం సాగించాలని హిందూపురం ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి పిలుపునిచ్చారు. పార్టీ స్థానిక కార్యాలయంలో ఆదివారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. బీకే మాట్లాడుతూ.. రాష్ట్రంలో జగన్ రాక్షస పాలన అంతమై, ప్రజల కష్టాలు తీరాలంటే రాబోయే ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేసి, పార్టీని అఖండ మెజార్టీతో గెలిపించాలన్నారు. తన అభ్యర్థనను మన్నించి పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు హిందూపురం ఎంపీ టిక్కెట్ కేటాయించారన్నారు. సమావేశంలో నాయకులు జీవీపీ నాయుడు, మునిమడుగు వెంకటరాముడు, కేశవయ్య, కురుబ కృష్ణమూర్తి, రొద్దం నరసింహులు, చిన్నప్పయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలంలో చేపడుతున్న భవన నిర్మాణాలు





గోరంట్ల మండల కాంప్లెక్స్‌కు కూతవేటు దూరంలో ఉన్న ప్రభుత్వ స్థలంలో వైసీపీ నాయకుల అండతో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయి. సర్వే నంబరు 271-2, 4లోని ప్రభుత్వ భూమిలో బోగస్ పట్టాలు సృష్టించి, పదిమంది ఆదివారం భవన నిర్మాణ పనులు కొనసాగిస్తున్నారు. వీఆర్వో మన్సూర్, వీఆర్ఏ వినోద్ అక్కడికెళ్లి పనులు ఆపేయాలన్నారు. వారు ఖాతరు చేయకపోవడంతో అక్కడి నుంచి వెళ్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ బాలాజీ, ఏఎస్ఐ మద్దిలేటి.. సిబ్బందితో వెళ్లి అక్రమ నిర్మాణాలు ఆపాలనీ, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీంతో పనులు ఆపేశారు. పోలీసులు వెళ్లిన తరువాత ఇంటి నిర్మాణం చేపడుతున్న లోకేశ్.. రెచ్చిపోయాడు. నిర్మాణ పనులకు కలిపిన సిమెంటు వృథా అయిందంటూ వీఆర్ఏ వినోద్‌పై అగ్రహం వ్యక్తం చేస్తూ దుర్భాషలాడాడు. 'నీ అంతు చూస్తానం'టూ బెదిరించినట్లు తెలిసింది. - గోరంట్ల

యథేచ్ఛగా ఆక్రమణలు

ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు

పోలీసులకు రెవెన్యూ సిబ్బంది ఫిర్యాదు

సిబ్బందిపై ఆక్రమణదారుడి దుర్భాషలు

2007లోనే ప్రభుత్వ లేఔట్ ఏర్పాటు

151 మంది పేదలకు ఇళ్లపట్టాలు ఇవ్వాలని 2007లో సర్వే నంబరు 271లోని ప్రభుత్వ స్థలంలో అధికారులు లేఔట్ వేశారు. పట్టాల పంపిణీ జరగలేదు. 2011లో అప్పటి తహసీల్దార్ చక్రపాణి 26 స్థలాలను పాత్రికేయులు, మరో నాలుగు కార్యాలయంలో పనిచేసే సిబ్బందికి ఇళ్ల పట్టాలిచ్చారు. ఊరికి దూరంగా ఉండడంతో ఒకరిద్దరు మాత్రమే ఇళ్ల నిర్మాణం చేపట్టారు. తరువాత వచ్చిన తహసీల్దార్లు కొంత మంది గుట్టుగా కొంతమందికి పట్టాలిచ్చారు. మాజీ సైనికులకు కూడా పట్టాలిచ్చారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక యథేచ్ఛగా ఆక్రమణల పర్వం ప్రారంభమైంది. ప్రభుత్వ స్థలంలో హెచ్చరిక బోర్డులను పలుమార్లు ఏర్పాటు చేసినా ప్రయోజనం లేదు. నిర్మాణాలు చేపడుతూనే ఉన్నారు. రెవెన్యూ కార్యాలయంలో ఇందుకు సంబంధించిన ఇళ్ల పట్టాల ఫైల్, రికార్డు మొత్తం గతంలోనే మాయం చేసినట్లు అధికారులు అంటున్నారు. 2022 డిసెంబరులో వైసీపీ నాయకులు.. అధికారులతో సంబంధం లేకుండా వారే కొలతలు వేసి, కావలసిన వారికి ప్లాట్లను పంచేశారు. దీంతో ఒకేసారి వందకుపైగా పునాదులు, నిర్మాణ పనులు ప్రారంభించారు. దీనిపై విమర్శలు రావడంతో అప్పట్లో అధికారులు.. ఆక్రమణలను తొలగించి, హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. కొంత కాలం తరువాత కొంతమంది పట్టా ఉందనీ, కోర్టు ఉత్తర్వు లున్నాయంటూ ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. అడిగేవారులేరని ఒక్కొక్కరు 8 సెంట్ల వరకు ఇళ్ల పునాదులు, నిర్మాణాలు చేసుకున్నారు. పండుగలు, ప్రభుత్వ సెలవు దినాల్లో, రాత్రి వేళల్లో నిర్మాణాలు చేపట్టినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఇటీవల తహసీల్దార్ అక్బల్ బాషాను జనసేన నాయకులు కలిసి, ప్రభుత్వ స్థలం ఆక్రమణపై వివరించారు. చర్యలు తీసుకోకపోతే పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామన్నారు. దీంతో తహసీల్దార్ పంచాయతీ పరిధిలోని ముగ్గురు వీఆర్వోలు, ముగ్గురు వీఆర్ఏలకు నోటీసులు జారీ చేశారు. ప్రభుత్వ స్థలం ఆక్రమణపై నిఘా ఉంచాలని ఆదేశించారు. దీంతో వారు ఆదివారం చేపడుతున్న అక్రమ నిర్మాణాలను అడ్డుకున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు.





లేఔట్‌లో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు .. నిర్మాణ పనులు నిలిపివేయాలంటున్న వీఆర్ఏ మన్సూర్, వీఆర్ఏ వినోద్

ఉష్ణోగ్రతలు (ఆది)	గరిష్ఠం	కనిష్ఠం
పుట్టపర్తి	38.0	24.0
కదిరి	37.0	23.0
ధర్మవరం	38.0	24.0
హిందూపురం	37.0	23.0
పెనుకొండ	37.0	24.0

రంజాన్ వేళలు	ఇఫ్తార్	సెహరీ
పుట్టపర్తి	6.34 సోమవారం (సాయంత్రం)	4.58 మంగళవారం (ఉదయం)
కదిరి	6.31 సోమవారం (సాయంత్రం)	5.05 మంగళవారం (ఉదయం)
ధర్మవరం	6.36 సోమవారం (సాయంత్రం)	5.02 మంగళవారం (ఉదయం)
హిందూపురం	6.34 సోమవారం (సాయంత్రం)	5.06 మంగళవారం (ఉదయం)
పెనుకొండ	6.33 సోమవారం (సాయంత్రం)	5.03 మంగళవారం (ఉదయం)

గోపాలకృష్ణపై దాడిచేసిన వారిని అరెస్టు చేయాలి

టీడీపీ వాణిజ్య విభాగ రాష్ట్ర అధ్యక్షుడు రాకేష్

మడకశిరటౌన్, మార్చి 24: ఆర్యవైశ్య సంఘం మడకశిర పట్టణ అధ్యక్షుడు గోపాల కృష్ణపై దాడిచేసిన వారిపై 307 కేసు నమోదు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని టీడీపీ వాణిజ్య విభాగ రాష్ట్ర అధ్యక్షుడు రాకేష్ డిమాండ్ చేశారు. ఆయన ఆదివారం పట్టణంలోని గోపాలకృష్ణ ఇంటికి వెళ్లి బాధితుడిని పరామర్శించారు. ఈ సందర్భంగా రాకేష్ మాట్లాడుతూ... వైసీపీ ప్రభుత్వం ల్యాండ్ టైటిలింగ్ విధానం వల్లే ఇలాంటి సంఘటనల కు ఆస్కారం ఏర్పడుతోందన్నారు. దానిని రద్దు చేయాలని ఎన్ని విన్నపాలు చేసినా ప్రభు త్వం పట్టించుకోకపోవడం బాధాకరం అన్నారు. ఇద్దరు వ్యక్తులు గోపాలకృష్ణపై దాడులు చేసినా చట్టప్రకారం పోలీసులు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. దాడి చేసిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోకపోతే జిల్లా ఎస్పీ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. రాజకీయాలకు, కులమతాలకు అతీతంగా ప్రతిఒక్కరూ దాడిని ఖండించారన్నారు. అనంతరం మడకశిర పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సీఐ మనోహర్‌తో మాట్లాడారు. దాడిచేసిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే మద్దనకుంట ఈరన్న, టీడీపీ వాణిజ్యవిభాగం నియోజకవర్గం అధ్యక్షుడు కట్టా కిశోర్, బీజేపీ నాయకులు పురుషోత్తం తదితరులు ఉన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ వాణిజ్య విభాగ రాష్ట్ర అధ్యక్షుడు రాకేష్

క్షయ వ్యాధిని నిర్మూలిద్దాం

జిల్లా వైద్యాధికారి కృష్ణారెడ్డి

పుట్టపర్తి రూరల్, మార్చి 24: క్రమం తప్పని వైద్యంతో క్షయవ్యాధిని పూర్తిగా నిర్మూలిద్దామని జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎస్వీ కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినాన్ని పురస్కరించుకుని స్థానిక జిల్లావైద్య, ఆరోగ్య శాఖాదికారి కార్యాలయం నుంచి ప్రశాంతిగ్రామ్ వై జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2025నాటికి టీబీని అంతం చేద్దామని పిలుపునిచ్చారు. రెండువారాలకు మించిన దగ్గు, సాయంత్రంపూట జ్వరం రావడం, అకలి మందగించడం, బరువు తగ్గిపోవడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే దగ్గరలో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించి గళ్ల పరీక్ష చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఐఓ కృష్ణయ్య, డీఎల్ఏటీ తిప్పయ్య, ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి, ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి, సీహెచ్ఓ నగేష్, ఎంపీహెచ్ఎస్ రామ్మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.




ర్యాలీ నిర్వహిస్తున్న జిల్లా వైద్యాధికారి, సిబ్బంది

చేనేత కుటుంబం ఆత్మహత్య దారుణం

బాధ్యులను కఠినంగా శిక్షించాలి

ధర్మవరం, మార్చి 24: కడప జిల్లా ఒంటిమిట్టలో చేనేత కుటుంబం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకోవడం దారుణమనీ, అందుకు బాధ్యులైన రెవెన్యూ అధికారులను కఠినంగా శిక్షించాలని టీడీపీ తొగటవీర క్షత్రియ సంఘం జిల్లా అధ్యక్షుడు పరిశే సుధాకర్ ఆదివారం ప్రకటనలో డిమాండ్ చేశారు. చేనేత కార్మికుడు సుబ్బారావు భూమిని రెవెన్యూ అధికారులు, వైసీపీ నేతల పేరిట రికార్డుల్లోకి ఎక్కించడం దారుణమన్నారు. ఆ విషయంలో రెవెన్యూ అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా పట్టించుకోకపోవడంతో ఆ చేనేత కార్మికుడు.. కుటుంబంతో కలిసి ఆత్మహత్య చేసుకున్నాడనీ, ఇది చాలా బాధాకరమన్నారు. ఇందుకు బాధ్యులైన రెవెన్యూ అధికారులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కడప జిల్లా ఒంటిమిట్టలో చేనేత కుటుంబం ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటనారాయణ, జిల్లా అధ్యక్షుడు పోలా లక్ష్మీనారాయణ ప్రకటనలో పేర్కొన్నారు. ఇందుకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలనీ, లేదంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

గురువులపైనే గు రి..!



- వైసీపీ సర్కారులో 'టార్గెట్ టీచర్స్'
- ప్రభుత్వం వచ్చీరాగానే.. వేధింపులు
- పలురకాల యాప్స్‌తో పనిభారం
- టాయిలెట్స్ క్లీనింగ్ నుంచి ఎండీఎం ఫొటోల వరకూ..
- ఎన్నికల వేళ తామేంటో చూపిస్తామంటున్న టీచర్లు

అనంతపురం విద్య, మార్చి 24 : వైసీపీ ప్రభుత్వం గురువులపైనే 'గురి' పెట్టినట్లుంది..ఏ మాత్రం అవకాశం దొరికినా వారిని వదలిపెట్టకుండా ముప్పు తిప్పలు పెడుతోంది. ఒకప్పుడు బడిపంతులు ఉద్యోగం అంటే ఉదయం వెళ్లి లంచ్‌బాక్స్‌తో వెళ్లి...బడిలో నాలుగు పాఠాలు చెప్పి.... చల్లగా సాయంత్రం ఇంటికి వచ్చేఉద్యోగం అనేవాళ్లు. పల్లెల్లో , పెద్దల్లో అయ్యవార్లు అంటే గౌరవం, పిల్లల్లో గురువుల పట్ల భక్తి, భయం ఉండేది. ప్రతి నెలా 1వ తేదీనే జీతం చెతికి అందేది. కానీ ఈ ఐదేళ్లలో సీన్ మారింది. వైసీపీ ప్రభుత్వం టోటల్ సీన్‌ను రివర్స్ చేశారని ఉపాధ్యాయ వర్గాలే వాపోతున్నాయి. ప్రతినెలా 10వ తేదీ, 12వ తేదీ వచ్చినా జీతాలు ఎప్పుడు వేస్తారో తెలియని అయోమయం. మరోవైపు ఫేషియల్ యాప్ పేరుతో ఉదయమే పరుగులు.. ఇంకో వైపు, టీచర్లు అంటేనే...అదేదో బూతు పదం అన్నట్లు వైసీపీ పెయిడ్ బ్యాచ్ ట్రోలింగ్స్ నడుమ టీచర్లు అనేక అభద్రతకు, అసహనానికి గురయ్యే పరిస్థితులు చూస్తున్నామని టీచర్లు మండిపడుతున్నారు. ఎన్నికల తరుణం వచ్చిందని.. టీచర్లపై ఈ ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం పెట్టిన అనేక ఆంక్షలు, షరతులపై మండిపడుతూ....తామేంటో చూపిస్తామంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

స్కూళ్లలో యాప్స్ భారం...



ఇక ఉపాధ్యాయులపై మరో భారం..పలు రకాల యాప్స్. వైసీపీ ప్రభుత్వం అనేక రకాల యాప్స్ పేరుతో ఉపాధ్యాయులపై భారం మోపింది. టాయిలెట్స్‌లోకి వెళ్లి నిత్యం క్లీన్‌గా ఉన్నాయో లేదో చూసి ఫొటోలు అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. గురువులు ఈ అంశాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. అదేవిధంగా మధ్యాహ్న భోజనం తయారీ సమయంలో...వంటలు వండటానికి ముందు...అన్ని పాత్రలను ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయాలి. తర్వాత వంటలు వండిన తర్వాత కూడా ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయాలి. అదేవిధంగా విద్యార్థుల అంటెండెన్స్ యాప్‌తోపాటు, పలు ఆన్‌లైన్ యాప్స్ పెట్టి...వాటిలో నిత్యం సమాచారం ఇవ్వాలంటూ...వేధించడంపై ఉపాధ్యాయులు భగ్గుమంటున్నారు. ఇదెక్కడి ప్రభుత్వం అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వచ్చినప్పటి నుంచి గురువులును టార్గెట్ చేస్తూ...అనేక ఇబ్బందులకు గురి చేస్తుండటంపై టీచర్లు ఆగ్రహంతో ఉన్నారు. నాడు-నేడు పనులు అంటూ... కరోనా సమయంలో కూడా పనులు చేయించారు. ఈక్రమంలో కొందరు ఉపాధ్యాయులు మృత్యువాత కూడా పడ్డారు. ఇలా చెప్పుకుంటూ...పోతే...అనేక అంశాల్లో టీచర్లను టార్గెట్ చేస్తూ రావడంపై ఆయా వర్గాలు మండిపడుతున్నారు. ప్రస్తుతం ఎన్నికలు రావడంతో తమ సత్తా ఏంటో చూపిస్తాం అంటూ బహిరంగంగానే ప్రకటిస్తున్నారు.



యాప్స్‌తో బోధనపై ప్రభావం: హరికృష్ణ, ఎస్టీయు రాష్ట్ర అధ్యక్షుడు



ఉన్నతాధికారులు స్కూళ్లలో సెల్‌ఫోన్లు వినియోగించకూడదు అంటూనే...అనేక యాప్స్ తీసుకొచ్చారు. ఈ యాప్స్ వల్ల బోధనకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. 11వ పీఆర్సీలో అరియర్స్ డీఏ అరియర్స్ రావాల్సి ఉంది. మెడికల్ బిల్స్, సరెండర్ బిల్స్ కూడా భారీగా పెండింగ్‌లో ఉంచి, ఉపాధ్యాయులును, ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేశారు. 117 జీవోను తీసుకొచ్చి విద్యారంగాన్ని, ఉపాధ్యాయులను మానసిక ఒత్తిడికి గురిచేశారు.

జీతాలపై కక్షపూరిత ధోరణి: లింగమయ్య, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి



ప్రభుత్వం.. ఉపాధ్యాయులపై కక్షపూరితంగా 1వ తేదీనే జీతాలు చెల్లించకుండా అనేక ఆర్థిక ఇబ్బందులకు గురి చేస్తోంది. బ్యాంకుల్లో అనేక అవసరాల కోసం రుణాలు తీసుకున్న గురువులు సకాలంలో బ్యాంకుల్లో ఇన్‌స్టాల్ మెంట్స్ చెల్లించక లేక అదనపు వడ్డీలు కట్టేందుకు అవస్థలు పడ్డారు. అప్పులకు సకాలంలో వాయిదాలు చెల్లించలేక అపవాదను మూటగట్టుకున్నారు. ఈ పరిస్థితిని ప్రభుత్వమే కల్పించింది. దీనికి ఈ ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవాల్సిన సమయం వచ్చింది.

పర్యవేక్షణ పేరుతో అవమానం: అశోక్ కుమార్, ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు



విద్యాశాఖ ఉన్నతాధికారులు స్కూళ్లలో పర్యవేక్షణ పేరుతో టీచర్లపై ఒత్తిడి పెంచారు. విద్యార్థుల అటెండెన్స్, గుడ్లు, చిక్కీలు, భోజనం ఫొటోలు అప్‌లోడ్ చేయడం వల్ల ఇటు బోధన కుంటుపడుతుంది. సకాంలో మెటీరియల్ ఇవ్వకుండానే....నాడు-నేడు పనులు పూర్తి చేయాలంటూ మరో వైపు టీచర్లపై ఒత్తిడి చేయడం, స్కూళ్లలో బోధనా సమయాల్లో టీచర్లకు ఆన్‌లైన్ ట్రైనింగ్స్ పెట్టడం, పర్యవేక్షణ పేరుతో టీచర్లను అవమానపర్చడం హేయం. అశాస్త్రీయ విధానాలు, నిర్ణయాల వల్ల టీచర్లు అనేక అవస్థలు పడ్డారు.

ఫేషియల్ యాప్ తొలి ప్రయోగం..

జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ఎయిడెడ్, జడ్పీ, ఎంపీపీ,ఇతర ప్రభుత్వ రంగ స్కూళ్లు 1694 వరకూ ఉన్నాయి. ఇందులో ప్రైమరీ 1186 స్కూళ్లు, అప్పర్‌ప్రైమరీ 219 స్కూళ్లు, హైస్కూల్ 293 స్కూళ్లు ఉన్నాయి. వీటి పరిధిలో సుమారు 1,99,912 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీటి పరిధిలో టీచర్లు సుమారు 8,643 మంది వరకూ పనిచేస్తున్నారు. అయితే వైసీపీ ప్రభుత్వం టీచర్లపై ఫేషియల్ యాప్ పేరుతో ప్రయోగానికి దిగింది. ఉదయం, సాయంత్రం స్కూళ్లలో తమ సెల్‌పోన్లలోనే అటెండెన్స్ వేయాలంటూ... .కొత్త నిబంధన పెట్టింది. హాజరు వేసేందుకు ప్రభుత్వం ఎలాంటి డిజిటల్ పరికరాలు ఇవ్వకుండానే.... ఉపాధ్యాయులను వాళ్ల సెల్‌పోన్లే వాడాలని ఒత్తిడి తెచ్చింది. నెట్ వర్క్ పని చేయక..సమయానికి పాఠశాలకు వచ్చినా అటెండెన్స్ పడక..పాపం తీవ్ర ఆవేదనకు లోనయ్యారు. ఉపాధ్యాయ సంఘాల నేతలు, నాయకులు, వ్యతిరేకించినా ప్రభుత్వం బలవంతంగా ప్రయోగించింది.

1వ తేదీన జీతాలే మరిచిపోయారు..



గత ప్రభుత్వంలో ఉపాధ్యాయులకు 1వ తేదీనే జీతంపడేది. నెలంతా కష్టపడితే.. 1వ తేదీ రాగానే..ఠంచన్‌గా తమ బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం జీతాలు వేసేది. దీంతో కుటుంబ అవసరాలతోపాటు, పిల్లలకు ఫీజుల చెల్లింపు, బ్యాంకుల్లో తీసుకున్న రుణాలకు ఈఎంఐల చెల్లింపు, వృద్ధుల ఆసుపత్రి ఖర్చులతోపాటు, ఇతర అవసరాలకు ఏ మాత్రం కష్టం లేకుండా సాగిపోయేది. జగన్ ప్రభుత్వం వచ్చాక....టీచర్లలో టెన్షన్ మొదలైంది. నెలంతా కష్టడినా... 1వతేదీ చూస్తే..ఖతాలు ఖాళీగానే ఉంటున్నాయి. 1వ తేదీ జీతాలు మరిచిపోయామని వారే వాపోతున్నారు. ఈ క్రమంలో బ్యాంకుల్లో తీసుకున్న గృహరుణాలు, వాహన రుణాలు, పిల్లల చదువులు లోన్స్‌కు ఈఎంఐలు సకాలంలో చెల్లించ లేక... అదనపు ఛార్జీలు చెల్లించిన సందర్భాలు అనేకం. దీంతో ఉపాధ్యాయులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

మద్దలచెరువులో ఉద్రిక్తత

- ఎన్నికల ప్రచారం నిర్వహించిన పరిటాల సునీత
- పార్టీ జెండాలతో వైసీపీ వర్గీయుల కవ్వింపు చర్యలు
- ఎస్పీ, ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్న సునీత



వైసీపీ జెండాలు పట్టుకుని ఈలలు వేస్తూ రెచ్చగొడుతున్న వైసీపీ వర్గీయులు

ధర్మవరంరూరల్, మార్చి 24: ఎన్నికల ప్రచారానికి వచ్చిన టీడీపీ నాయకులను చూసి వైసీపీ వర్గీయులు కవ్వింపు చర్యలకు దిగడంతో కనగానపల్లి మండలం మద్దలచెరువులో ఆదివారం ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. అయితే మాజీమంత్రి పరిటాల సునీత కలగజేసుకుని తమ నాయకులు, కార్యకర్తలను సంయమనం పాటించాలని సూచించడంతో పరిస్థితి సద్దుమణిగింది. సమస్యాత్మక గ్రామంలో పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టకపోగా, ఏకపక్షంగా వ్యవహరించడంతోనే ఇలాంటి ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడటానికి కారణం అయ్యాయని టీడీపీ వర్గీయులతో పాటు గ్రామస్థులు సైతం పెదవి విరుస్తున్నారు. మద్దలచెరువు గ్రామంలో మాజీమంత్రి పరిటాల సునీత ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం రోడ్‌షో నిర్వహించారు. ఈ క్రమంలో మద్దెలచెరువు సూరి అలియాస్ గంగుల సూర్యనారాయణరెడ్డి ఇంటి సమీపంలో ప్రచార రథం వెళుతుండగా అప్పటికే అక్కడ గుమిగూడి ఉన్న కొందరు వైసీపీ వర్గీయులు మద్యం మత్తులో వైసీపీ జెండాలు తిప్పుతూ, తొడలు కొడుతూ, ఈలలు వేస్తూ కేకలు, అరుపులతో కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. దీంతో టీడీపీ వర్గీయులు కొంతమంది వారిని చూసి టీడీపీ కండువాలను తిప్పారు. ఈ క్రమంలో ఇరువర్గాల కేకలు, అరుపులతో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. మాజీ మంత్రి పరిటాల సునీత కలుగజేసుకుని టీడీపీ కార్యకర్తలందరూ సంయమనం పాటించాలని కోరారు. ఓటమి భయంతోనే వైసీపీ వర్గీయులు రెచ్చగొడుతున్నారని ఆమె తెలిపారు. ఈసారి రాప్తాడులో టీడీపీ గెలుస్తుందన్న భయంతో తోపుదుర్తి సోదరులు వైసీపీ కార్యకర్తలతో మద్యం తాగించి ఇలా టీడీపీ ప్రచారాల్లోకి రెచ్చగొట్టి పంపుతున్నారని ఆరోపించారు. ఎన్నికల ప్రచారానికి తాము అధికారుల నుంచి అనుమతి తీసుకుని గ్రామానికి వచ్చామని, ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా పోలీసులు ముందుజాగ్రత్తలు తీసుకోవడంలో విఫలమయ్యారని విమర్శిం చారు. పోలీసులలో కూడా కొందరు ఏకపక్షంగా వ్యవహరిస్తూ రెచ్చగొట్టే వారిని కాకుండా టీడీపీ వర్గీయులనే వీడియోలు తీస్తూ భయభ్రాంతు లకు గురిచేస్తున్నారని, ఈ విషయంపై ఎస్పీ, ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తానని ఆమె తెలిపారు. కాగా సూరి భార్య భానుమతి ఆరోగ్యం బాగా లేదని తెలిసి తానెంతో బాధపడ్డానని ఆమె పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ వచ్చినప్పటికీ కూడా కొంతమంది పోలీసులు ఇంకా అధికారపార్టీకి వంతుపాడుతూ వారికి అనుకూలంగా వ్యవహరించడం తోనే ఇలాంటి దుశ్చర్యాలకు వైసీపీ వర్గీయులు పాల్పడుతున్నట్లు టీడీపీ వర్గీయులు ఆరోపించారు.



సూరి ఇంటి ముందు ఉద్రిక్త పరిస్థితి



కోడూరు వద్ద జాతీయ రహదారిపై బోల్తా పడిన ఆర్టీసీ బస్సు

ఆర్టీసీ బస్సు బోల్తా

- ఐదుగురికి గాయాలు

చిలమత్తూరు, మార్చి 24: ఎదురుగా వస్తున్న వాహనాన్ని డ్రైవర్ తప్పించ బోగా తాడిపత్రి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఐదుగురు గాయపడ్డారు. తాడిపత్రి డిపోకు చెందిన ఆర్టీసీ డీలెక్స్ బ స్సు బెంగళూరు నుంచి తాడిపత్రి వెళుతోంది. ఆ బస్సు ఉదయం 10 గంటల సమ యంలో కోడూరు తోపు వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న వాహనాన్ని డ్రైవర్ తప్పించ బోగా... రోడ్డు పక్కన ఉన్న సేఫ్టీ పోల్స్‌ని ఢీకొట్టి బస్సు బోల్తాపడింది. డ్రైవర్ రామ్మోహన్ వేగం తగ్గించి బస్సును నడపతుండటంతో కొంత వరకు పెద్ద ప్రమాదమే తప్పిందని ప్రయాణికులు తెలిపారు. ఈ సమయంలో బస్సులో 22 మంది ప్రయాణిస్తున్నారు. వారిలో ఐదుగురు గాయపడ్డారు. బస్సు బోల్తాపడిన వెంటనే స్థానికులు అక్కడికి చేరుకొని ఎమెర్జెన్సీ విండోలను పగులగొట్టి ప్రయాణి కులను సురక్షితంగా బయటికి తీశారు. ఈ ప్రమాదంలో బుక్కరాయసముద్రానికి చెందిన లక్ష్మీదేవమ్మ, అజయ్, తాడిపత్రికి చెందిన లక్ష్మీనారాయణ, ఉరవకొండకు చెందిన కళావతి, బస్సు డ్రైబర్ కం కండక్టర్ రామ్మోహన్ గాయపడ్డారు. సమా చారం తెలుసుకున్న ఏఎస్‌ఐ సుబ్రహ్మణ్యం ప్రమాద స్థలానికి చేరుకున్నారు. గాయపడిన వారిని 108 వాహనంలో హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

తగ్గేదేలే..!

ఎన్నికల ప్రచారంలో పాల్గొనకూడదన్న నిబంధనలను ఉమ్మడి జిల్లాలో వలంటీర్లు, స్టోర్ డీలర్లు బేఖాతరు చేస్తున్నారు. ఎవరెన్ని చెప్పినా, చర్యలు తీసుకున్నా తగ్గేదేలా అంటూ ప్రచారంలో పాల్గొంటున్నారు. వీరిపై కొన్ని చోట్ల చర్యలు తీసుకుంటున్నారు. మరికొందరికి నోటీలసులు ఇస్తున్నారు. అయినా మార్పు రావడం లేదు. - (న్యూస్ నెట్‌వర్క్, ఆంధ్రజ్యోతి)

- తనకల్లు మండలంలోని రాచినేపల్లి గ్రామంలో శనివారం వైసీపీ అభ్యర్థి మక్బూల్ అహమ్మద్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో రాచినేపల్లి పంచాయతీకి చెందిన వలంటీర్లు మనోహర్ నాయుడు, శ్రీహరి నాయుడు పాల్గొన్నారు. ఇంటింటికెళ్లి ప్రచారం నిర్వహించారు.



తనకల్లు మండలంలో వైసీపీ ప్రచారంలో వలంటీరు (వృతంలో)

- గుడిబండ మండలంలోని మోపుర



గుడిబండ ప్రచారంలో వలంటీర్ మహలింగప్ప (వృత్తంలో..)

గుండ్ల గ్రామంలో మూడు రోజుల క్రితం వైసీపీ నాయకులు నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో దేవరహట్టి పంచాయతీ బీఎం పాళ్యం గ్రామ వలంటీరు ఎన్నికల ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన మహలింగప్పపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

విధుల నుంచి వలంటీర్ తొలగింపు

తనకల్లు: మండలంలోని రాచినేపల్లికి చెందిన వలంటీర్ కమలాకర్‌నాయుడును విధులనుంచి తొలగించినట్లు ఎంపీడీఓ పూల నరసింహులు ఆదివారం తెలిపారు. రాచినేపల్లిలో వైసీపీ శనివారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో వలంటీర్ కమలాకర్‌నాయుడు పాల్గొన్నారు. ఈవిషయం పత్రికల్లో ప్రచురితమవడంతో స్పందించిన ఎంపీడీఓ వలంటీర్‌ను విధులనుంచి తొలగించినట్లు తెలిపారు.

ఫీల్డ్ అసిస్టెంట్, వలంటీర్ సస్పెన్షన్

బుక్కరాయసముద్రం: శింగనమల నియోజకవర్గం వైసీపీ అభ్యర్థి వీరాంజినేయుల ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఒక ఫీల్డ్ అసిస్టెంట్, గ్రామ వలంటీర్‌ను సస్పెండ్ చేశారు. మరో ముగ్గురు డీలర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఆర్వో వెన్నల శీను తెలిపారు. శింగనమల మండలంలో వెస్ట్ నరసాపురం ఫీల్డ్ అసిస్టెంట్ భాస్కర్, గ్రామ వలంటీర్ వెంకటేశులు వైసీపీ అభ్యర్థి వీరాంజినేయులుకు మద్దతుగా ప్రచారం చేయడంతో సంబంధిత శాఖ అధికారుల నివేదిక ఆధారంగా ఇద్దరిని సస్పెండ్ చేసినట్లు ఆర్వో తెలిపారు. బుక్కరాయసముద్రం మండల నీలంపల్లి గ్రామంలో ప్రచారంలో పాల్గొన్న డీలరు భర్త ప్రభాకర్‌రెడ్డి, టీకేఎస్ డీలర్లు శేషానందారెడ్డి, రాజారెడ్డికి షోకాజ్ నోటీసులు ఇచ్చామన్నారు. రెవెన్యూ అధికారుల నివేదిక అనంతరం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కోడ్ ఉల్లంఘించిన వారిపై వేటు

- వలంటీర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, డీలర్లు, పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్: కలెక్టర్

అనంతపురం టౌన్, మార్చి 24: ఎన్నికల కమిషన్ ఆదేశాలు లెక్కచేయకుండా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వలంటీర్లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, రేషన్ డీలర్లు, పంచాయతీ కార్యదర్శిని విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు కలెక్టర్ గౌతమి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లావ్యాప్తంగా 18 మంది వలంటీర్లు, ఐదుగురు రేషన్ డీలర్లు, ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్లు, ఒక పంచాయతీ కార్యదర్శిని తొలగించినట్లు తెలిపారు. పోస్టర్లు, బ్యానర్లు తొలగించలేదని, గొడలపై పార్టీ రంగులు, పేర్లు తొలగించలేదని సీ విజిల్ డిజిటల్ యాప్ ద్వారా 168 ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఆ ఫిర్యాదులను ఎన్నికల కమిషన్ సూచనల మేరకు 100 నిమిషాల్లో పరిష్కరించామన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌లో భాగంగా 5,036 పోస్టర్లు, 2,204 బ్యానర్లు, 627 గోడలపై పార్టీ రాతలు తొలగించామన్నారు. 2,986 నాయకుల విగ్రహాలు, ఫొటోలను వస్త్రాలతో కప్పివేశామన్నారు. అనుమతి లేకుండా తరలిస్తున్న రూ. 16.94 లక్షలను సీజ్ చేశామని తెలిపారు.

ప్రజాధనంతో వేతనం... వైసీపీ సేవలో నిమగ్నం

పెనుకొండ టౌన్, మార్చి24: ప్రజాధనంతో వేతనం తీసుకుంటున్న ఓ ఉద్యోగి వైసీపీకి చేస్తున్నారు. ఎన్నికల నిబంధనల మేరకు అధికారులు, ప్రభుత్వ వేతనం తీసుకునే ఉద్యోగులు ఏ రాజకీయ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనకూడదని ఆదేశాలు ఉన్నాయి. అయినా పలువురు ఉద్యోగులు అధికార పార్టీ అండతో బరితెగిస్తూనే ఉన్నారు. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీ చరణ్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమందేపల్లి మండలంలో ఇంటింటికి తిరుగుతున్నారు. ఈ క్రమంలో ఆదివారం మండలకేంద్రంలోని మారుతినగర్‌లో ప్రభుత్వ వేతనం తీసుకొనే ఒకటో సచివాలయ కంప్యూటర్ ఆపరేటర్ భార్గవి, ఆమె భర్త మహేష్ ఎమ్మెల్యే అభ్యర్థికి పూలమాల వేసి సన్మానించారు. తిరిగి ఆమె ఆ పూలమాలను ఉద్యోగి భర్తకు వేయడం చర్చనీయాంశమైంది.



సచివాలయ ఉద్యోగి (వృత్తంలో) ఇంట్లో వైసీపీ కార్యక్రమం

కోడ్ ఉల్లంఘించారని ఈసీకి ఫిర్యాదు

కదిరి, మార్చి 24: ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించి హిందూపురం పార్లమెంటు వైసీపీ అభ్యర్థి బోయ శాంత, కదిరి నియోజకవర్గ అభ్యర్థి మగ్బూల్ అహ్మద్ సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారని టీడీపీ కదిరి నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ ఆదివారం ఎన్నికల కమిషన్‌కు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశారు. ఈనెల 16 వ తేదీ నుంచి ఎన్నికల నిబంధనలు రాష్ట్రంలో అమల్లోకి వచ్చాయన్నారు. వీటికి విరుద్ధంగా ఈనెల 17న సీఎంఆర్ఎఫ్ చెక్కులను నంబులపూలకుంట మండలం మేకలచెరువులో వైసీపీ అభ్యర్థులు పంపిణీ చేశారని చెప్పారు. దీనిపై చర్యలు తీసుకోవాలని ఆయన ఫిర్యాదులో కోరారు.

నీట్, ఎంసెట్‌కు ఉచిత శిక్షణ

అనంతపురం విద్య, మార్చి 24: ఎంసెట్, నీట్, జేఈఈ తదితర పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతున్న విద్యార్థులకు స్థానిక కమలానగర్‌లోని సాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులు ఓబిరెడ్డి, గజలక్ష్మి ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఉచిత శిక్షణ కోసం ఈనెల 27, 31 తేదీల్లో టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తామన్నారు. ఎంపికైన విద్యార్థులకు నిపుణులైన అధ్యాపకులతో శిక్షణ ఇస్తామన్నారు. వివరాలకు కమలానగర్ లోని తమ ఇన్‌స్టిట్యూట్‌లోగానీ, 9059723829, 7509033379 నంబర్లలోగానీ సంప్రదించాలని తెలిపారు.

అనాథలైన చిన్నారులకు న్యాయం చేయాలి

- రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన దామోదర్ నాయుడి బంధువుల ఆందోళన
- పోలీసు స్టేషన్ ఎదుట మృతదేహంతో బైఠాయింపు

పుట్టపర్తి రూరల్, మార్చి 24: రోడ్డు ప్రమాదాల్లో తల్లి దండ్రులను కోల్పోయి అనాథలుగా మారిన చిన్నారులకు న్యాయం చేయాలంటూ శ్రీసత్యసాయి జిల్లాకేంద్రమైన పుట్టపర్తిలో అర్బన్ పోలీసు స్టేషన్ ఎదుట మృతుడి బంధువులు మృతదేహంతో ఆందోళన నిర్వహించారు. పట్టణంలోని శ్రీసత్య సాయి ప్రైమరీస్కూల్ ఎదుట శనివారం మధ్యాహ్నం ఇన్నోవా కారు స్కూటీని ఢీకొన్న ప్రమాదంలో స్థానిక హోటల్ యాజమాని లెక్కల దామోదర్‌నాయుడు మృతి చెందిన విషయం విధితమే. మృతదేహానికి పెనుకొండ ఆస్పత్రిలో ఆదివారం ఉదయం పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని బంధువులు, పెద్దకమ్మవారిపల్లి గ్రామస్థులు అర్బన్ పోలీసు స్టేషన్ ఎదుట ఉంచి ఆందోళనకు దిగారు.

పలువురు మాట్లాడుతూ అర్బన్ సీఐ కేసును పక్కదారి పట్టించేలా ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఒకానొక దశలో మహిళలు, పురుషులు స్టేషన్లోకి వెళ్లడానికి ప్రయత్నించారు. పుట్టపర్తి అర్బన్, రూరల్, బుక్కపట్నం పోలీసులతో పాటు స్పెషల్‌పార్టీ పోలీసులు అక్కడికి చేరుకుని ఆందోళనకారులను స్టేషన్‌లోకి వెళ్లకుండా అడ్డుకున్నారు. రూరల్ సీఐ రాగిరి రామయ్య ఆందోళనకారులతో చర్చించినప్పటికీ ఫలితం లేకపోయింది. డీఎస్పీ వాసుదేవన్ అక్కడకి చేరుకుని వారిని సముదాయించారు. ఇంతలో అక్కడకు చేరుకున్న మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి పోలీసు అధికారులతో మాట్లాడి బాధితకుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. డీఎస్పీ మాట్లాడుతూ అనుకోకుండా ప్రమాదం జరిగిందని, ఈ ఘటనకు బాధ్యులైన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని, పోలీసు స్టేషన్ ఎదుట ఆందోళన చేయడం సరైంది కాదని, ఆందోళనకారులను సముదాయించాలని పల్లెను కోరారు. మృతు డి కుటుంబానికి న్యాయం చేసేవరకు ఇక్కడినుంచి కదిలేదిలేదని ఆందోళనకారులు పేర్కొనడంతో.. పల్లె ఎస్పీ మాధవరెడ్డితో ఫోన్‌ద్వారా మాట్లాడారు. మొదట మృతదేహాన్ని అక్కడి నుంచి తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించాలని, ఆ తర్వాత సమావేశం ఏర్పాటు చేసి బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చర్చిద్దామని ఎస్పీ పేర్కొనడంతో.. మృతదేహాన్ని అంత్యక్రియలకు తీసుకెళ్లారు. స్టేషన్ ఎదుట రోడ్డుపై బైఠాయించడంతో సుమారు మూడుగంటల పాటు ట్రాఫిక్ స్తంభించింది. తొమ్మిదేళ్ల క్రితం రోడ్డుప్రమాదంలో తల్లి, ఇప్పుడు తండ్రిని కోల్పోయి చిన్నారులు అనాథలయ్యారు.



మృతదేహంతో ధర్నాచేస్తున్న బంధువులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కందికుంట వెంకట ప్రసాద్

ఆంధ్రాలోనే గంజాయికి మూలాలు : కందికుంట

కదిరి, మార్చి 24: దేశంలో గంజాయి ఏరాష్ట్రంలో దొరికినా వాటి మూలాలు ఆంధ్రాలోనే ఉంటాయని టీడీపీ కదిరి నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకట ప్రసాద్ పేర్కొన్నారు. పట్టణంలోని తన నివాసంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అన్నపూర్ణగా ఉన్న ఆంధ్రాను గంజాయి ఆంధ్రాగా మార్చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. దేశంలో ఎక్కడ గంజాయి దొరికినా.. వాటి మూలాలు ఆంధ్రాలోనే ఉంటాయన్నారు. గంజాయి మత్తుకు రాష్ట్రంలోని యువత చిత్తవుతోందన్నారు. ఇటీవల బ్రెజిల్ నుంచి విశాఖ తీరానికి 25వేల కేజీల మత్తుపదార్థాలు చేరాయన్నారు. ఇది వైసీపీకి చెంది వ్యక్తి దిగుమతి చేసుకుంటే, నిస్సిగ్గుగా టీడీపీ వారివని చెప్పడానికి వైసీపీవారు ప్రయత్నం చేస్తున్నారన్నారు. బ్రెజిల్ అధ్యక్షుడు గెలిస్తే వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి శుభాకాంక్షలు తెలిపారన్నారు. బ్రెజిల్‌కు విజయసాయిరెడ్డికి ఏమి సంబంధమని ప్రశ్నించారు. రాష్ట్రాన్ని మత్తులో ముంచేసి గెలవాలని సీఎం ప్రయత్నిస్తున్నట్లు ఆయన ఆరోపించారు.

వైసీపీ అభ్యర్థికి ఎస్కార్ట్ ఎందుకు..?

రాజకీయ పార్టీలు అభ్యర్థులను ప్రకటించడం సహజమని, అయితే నామినేషన్లు పూర్తి అయిన తరువాత అభ్యర్థిగా నిలబడితే అప్పుడు ప్రభుత్వం భద్రత కల్పిస్తుందని, ఇది ఆనవాయితీ అని కందికుంట అన్నారు. కాగా అందుకు విరుద్ధంగా వైసీపీ అభ్యర్థిని ప్రకటిస్తానే ఆయనకు గన్‌మెన్లను ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. ఇది అధికార దుర్వినియోగమన్నారు. పోలీస్ అధికారులు ఎన్నికల కోడ్ వచ్చినా వైసీపీకి కొమ్ముకాస్తున్నారని మండిపడ్డారు. వైసీపీ అభ్యర్థికి ర్యాలీలో ముందు పోలీస్ ఎస్కార్ట్ పోవడం వెనుక అంతర్యమేమిటన్నారు. ఏ నిబంధనలతో ఎస్కార్ట్ ఇచ్చారని ప్రశ్నించారు. ఎన్నికల కమిషన్ దీనిపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు మోహూరిశెట్టి చంద్రశేఖర్, మేడా శంకర్, కేటీ నాగప్ప, కుటాగుళ్ల శంకర్, చెన్నకేశవులు ఉన్నారు.

తాగునీటి సమస్యపై మహిళల ఆందోళన



ఖాళీ బిందెలతో ఆందోళన చేస్తున్న మహిళలు

ఓబుళదేవరచెరువు, మార్చి 24: తమ గ్రామంలో నెలకున్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ మండలంలోని కొండకమర్ల పంచాయతీ దిగువ గంగిరెడ్డిపల్లి గ్రామ మహిళలు ఆదివారం ఖాళీ బిందెలతో ఆందోళన నిర్వహించారు. ఈసందర్భంగా మహిళలు వరలక్ష్మీ, ప్రభావంతమ్మ, క్రిష్టమ్మ, తులసమ్మ మాట్లాడుతూ తమ గ్రామంలో కొన్ని నెలలుగా తాగునీటి సమస్య నెలకొందన్నారు. గుక్కెడు నీరుకూడా దొరక్కపోవడంతో దాహార్తితో ఇబ్బందులు పడుతున్నామన్నారు. సమస్యను పలుమార్లు తెలిపినా అధికారులు పట్టించుకోలేదన్నారు. కార్యాలయాల చుట్టు తిరిగినా ఫలితం లేకపోయిందన్నారు. అందుకే ఆందోళన చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికైనా స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. వీరికి జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పత్తి చంద్రశేఖర్, మండలాధ్యక్షుడు మేకల ఈశ్వర్, ప్రధాన కార్యదర్శి కొండబోయన సతీష్, టీడీపీ జయచంద్రారెడ్డి మద్దతు తెలిపారు. వారు గ్రామ కార్యదర్శి విశ్వనాథ్‌రెడ్డితో ఫోన్‌ద్వారా మాట్లాడారు. రెండురోజుల్లో సమస్య పరిష్కరిస్తామని కార్యదర్శి హామీ ఇచ్చారు.

రామ్‌చరణ్ అభిమానుల రక్తదానం

కదిరిఅర్బన్, మార్చి 24: సినీ హీరో రామ్‌చరణ్ అభిమానులు ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఇందులో చిరంజీవి, రామ్‌చరణ్ అభిమానులు పాల్గొని రక్తదానం చేశారు. ఈనెల 27వ తేదీన రామ్‌చరణ్ జన్మదినోత్సవం సందర్భంగా సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు పలువురు తెలిపారు. అందులో భాగంగా రక్తదానం శిబిరం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో అభిమానులు నారాయణ స్వామి, చంద్రమోహన్, బావాజీ, మురళి, శివకుమార్, ప్రదీప్, వెంకటేష్, లక్ష్మన్, పవన్‌కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న అభిమానులు

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

నంబులపూలకుంట, మార్చి 24: మండలంలోని ముదుపులజీవి సమీపంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ శ్రీధర్ తెలిపారు. ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని శనివారం రాత్రి సమాచారం వచ్చిందని, వెంటనే దాడులు చేసి ట్రాక్టర్‌ను పట్టుకుని సీజ్ చేశామని అన్నారు. అనంతరం ట్రాక్టర్ యజమానిపై కేసు నమోదు చేశామన్నారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఎవరూ ఇసుకను తరలించకూడదన్నారు. అలా తరలిస్తే వాహన యజమానులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఉన్నారు.



పట్టుబడిన ఇసుక ట్రాక్టర్

కిడ్నాప్ కలకలం

కొత్తచెరువు, మార్చి 24: శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువు మండల కేంద్రంలో చికెన్ సెంటర్ యజయాని ఉప్పు చలపతి కిడ్నాప్ ఆదివారం కలకలం రేపింది. కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చలపతి కొత్తచెరువులో చికెట్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. దినచర్యలో భాగంగా తెల్లవారుజామునే చికెన్ సెంటర్ తెరవడానికి ఇంటి నుంచి ద్విచక్రవాహనంలో బయల్దేరాడు. అప్పటికే బుక్కపట్నం ప్రధాన రహదారిలో రెండు కార్లలో గుర్తుతెలియని వ్యక్తులు కాపుకాచారు. చలపతి రాగానే నలుగురు వ్యక్తులు బంధించి, కారులోకి వేసుకుని ముదిగుబ్బ వైపు వెళ్లిపోయారు. స్థానికులు చూసి, కేకలు వేశారు. అయినా వారు ఆపకుండా వెళ్లిపోయారు. వెంటనే చలపతి భార్య నాగమణికి విషయం తెలిపారు. ఆమె 100కు ఫోన్ చేసి, పోలీసులకు కూడా ఫిర్యాదు చేసింది. వెంటనే స్పందించిన పోలీసులు ముదిగుబ్బ పోలీసులకు సమాచారం అందించారు. కిడ్నాపర్లను వెంబడించి ముదిగుబ్బ రైల్వేస్టేషన్ సమీపంలో కారును పట్టుకున్నారు. అందులో ఉన్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. చలపతిని రక్షించారు. కిడ్నాప్‌నకు కారణాలపై నిందితులను విచారిస్తున్నట్లు తెలుస్తోంది. చలపతి సమీప బంధువు డబ్బు కోసమే కిడ్నాప్ చేయించి, ఉంటాడని బాధితుడి బంధువులు పేర్కొంటున్నారు.



కిడ్నాప్ అయిన చలపతి



పోలీసులు స్వాధీనం చేసుకున్న కారు

టీడీపీ, జనసేనలోకి భారీగా చేరికలు

● పలు గ్రామాల్లోని వైసీపీకి చెందిన 97 కుటుంబాలు చేరిక ●ఆహ్వానించిన మాజీ మంత్రి పల్లె, జనసేన నేత పత్తి చంద్రశేఖర్

ఓబుళదేవరచెరువు, మార్చి 24: మండలంలోని పలు గ్రామాలకు చెందిన వైసీపీ శ్రేణులు భారీగా టీడీపీ, జనసేనలోకి చేరారు. సున్నపల్లి పంచాయతీలోని పెద్దగుట్లపల్లి, అల్లాపల్లి పంచాయతీలోని దాదిరెడ్డిపల్లి గ్రామాలకు చెందిన సుమారు 97 కుటుంబాల వారు ఆదివారం వైసీపీని వీడి టీడీపీ, జనసేన తీర్థం పుచ్చుకున్నారు. ఆయా గ్రామాల్లో పల్లె పర్యటించారు. ఆయనకు స్థానిక టీడీపీ నాయకులు, గ్రామస్థులు పూలవర్షం కురిపించి, హారతులతో స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశాల్లో 97 కుటుంబాల వారు పల్లెతో పాటు జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి పత్తి చంద్రశేఖర్ సమక్షంలో టీడీపీ, జనసేన పార్టీలలోకి చేరారు. దాదిరెడ్డిపల్లిలో మీసాల సోమశేఖర్‌రెడ్డి, సామ వీరారెడ్డి, దాదిరెడ్డి బయపరెడ్డి, హనుమంతురెడ్డి, జెరిపిటి వెంకటేష్, కోటప్ప, వెంకటస్వామి, వెంకటేష్, పాపారెడ్డితోపాటు దాదాపు 26కుటుంబాల వారు చేరారు. అలాగే పెద్దగుట్లపల్లిలో బాబురెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, అనిల్‌కుమార్, విశ్వనాథ్‌రెడ్డి, నిర్మలమ్మ, సరస్వతమ్మ, ఆదిలక్ష్మమ్మ, శైలజ, రాజు, అనిల్‌కుమార్‌తోపాటు 71కుటుంబాల వారు చేరారు. వీరికి పల్లె, పత్తి చంద్రశేఖర్ టీడీపీ ,జనసేన కండువాలు వేసి పార్టీలలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పల్లె మాట్లాడుతూ వైసీపీ విధానాలు నచ్చక చాలామంది ఆ పార్టీ శ్రేణులు టీడీపీ, జనసేనలోకి చేరుతున్నారన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందన్నారు. ఎలాంటి అభివృద్ధి పనులు జరగలేదన్నారు. ముఖ్యంగా సత్యసాయిబాబా నడియాడిన పవిత్ర క్షేత్రమైన పుట్టపర్తి గడ్డను అపవిత్రం చేసిన వ్యక్తి ఎవరైనా ఉన్నారంటే అది ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డే అని దుయ్యబట్టారు. ఎమ్మెల్యే అవినీతి, ఆరచకాలకు బిల్డర్లు పుట్టపర్తిలోంచి పారిపోయారన్నారు. చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్రం మళ్లీ ప్రగతి పథంలో నడుస్తుందన్నారు. భావితరాల వారికి భవిష్యత్తు.. చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. కనుక వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిని గెలిపించాలని ప్రజల్ని కోరారు. నియోజకవర్గంలో పల్లె సింధూరారెడ్డిని ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండలకన్వీనర్ శెట్టివారి జయచంద్ర, జడ్పీటీసీ మాజీ సభ్యుడు పిట్టాఓబులరెడ్డి, జనసేన మండలాధ్యక్షుడు మేకల ఈశ్వర్, సర్పంచ్ దారా లక్ష్మిదేవి, ఎంపీటీసీ శ్రీనివాసులు, బీజేపీ మండలాధ్యక్షుడు రంగారెడ్డి, ఆయా పార్టీల నాయకులు నాగేంద్ర, శంకర్‌రెడ్డి, రాజారెడ్డి, తుమ్మ మహబూబ్‌బాషా, అంజనప్ప, సుధాకర్, నారప్పరెడ్డి, నిజాం, మండోజీ ఆర్ఫీఖాన్, మిద్దె రమణారెడ్డి, వలిపి సోమశేఖర్, కంచి సురేష్, సుధాకర్‌రెడ్డి, గంటి శ్రీనివాసులు, ఆర్ఎంపీ కృష్ణమూర్తి, మస్తానమ్మ, అఖిల, జ్యోతి, కొండబోయన సతీష్, దివాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ, జనసేనలోకి చేరిన వారితో మాజీమంత్రి పల్లె తదితరులు

దొన్నికోటలో పల్లె ఎన్నికల ప్రచారం

నల్లమాడ: మండలంలోని దొన్నికోటలో ఆదివారం మాజీమంత్రి పల్లె రఘునాథ రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రోడ్డుషో చేస్తూ చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఎన్నికల్లో పల్లె సింధూరా రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. టీడీపీ, జనసేన,బీజేపీ ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వస్తే సుపరిపాలన అందిస్తామని పేర్కొన్నారు. గడిచిన ఐదేళ్లలో సీఎం జగన్ ప్రజలకు ఎలాంటి మంచి చేయలేకపోయారన్నారు. చంద్రబాబు సీఎం అయితే రాష్ట్రం మళ్లీ ప్రగతి పథంలో నడుస్తుందని అన్నారు. ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేసి చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ షైలే శివ శంకర్, మాజీ కన్వీనర్ కేశవరెడ్డి, నాయకులు మహేంద్రరెడ్డి, వెంకటరమణనాయుడు, గంగులప్పనాయుడు, రాజారెడ్డి, సలాంఖాన్, అశోక్‌ఖాన్, చిదంబరరెడ్డి, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో నాటుసారా ఊట ధ్వంసం

నంబులపూలకుంట, మార్చి 24: మండలంలోని నల్లగుట్టపల్లితండాలో సారా తయారీ కేంద్రాలపై ఆదివారం తెల్లవారుజామున ఎస్‌ఐ శ్రీధర్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది దాడులు నిర్వహించారు. కార్డెన్ సెర్చ్‌లో భాగంగా జిల్లా సరిహద్దు గ్రామమైన నల్లగుట్టపల్లితండాలో పర్యటించి రెండువందల లీటర్ల నాటు సారా తయారీ ఊటను ధ్వంసం చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. సారాకు ఉపయోగించే బిందెలు, కుండలు, ఎదురు బొంగులను ధ్వంసం చేసి, తమ్మ చెక్కను కాల్చి వేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది వివేకానంద, పోతన్న, రమణ, మౌలా తదితరులు పాల్గొన్నారు.

నల్లమాడ: మండలంలోని బసిరెడ్డిపల్లి సమీపంలో గల అటవీ ప్రాంతంలో నాటుసారా తయారు చేస్తున్న స్థావరాలపై ఆదివారం ఎస్‌ఐ రమేష్‌బాబు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా రెండు స్థావరాల్లో దాడులు చేసి నాలుగువందల లీటర్లు నాటుసారా ఊట ధ్వంసం చేశారు. సామగ్రికి నిప్పు పెట్టారు. ఇక్కడ తయారు చేస్తున్నవారిని గుర్తించి వారిపై కేసులు నమోదు చేస్తామని ఎస్‌ఐ పేర్కొన్నారు.



బసిరెడ్డిపల్లి అటవీ ప్రాంతంలో నాటుసారా ఊటను ధ్వంసం చేస్తున్న పోలీసులు

భక్తిశ్రద్ధలతో గిరి ప్రదక్షిణ

పుట్టపర్తి, మార్చి 24: పట్టణంలో సత్యసాయి భక్తులు ఆదివారం గిరిప్రదక్షిణను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రాత్రి 7గంటల ప్రాంతంలో ప్రశాంతినిలయం గణేశ్ గేటు వద్ద సత్యసాయి రథాన్ని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం రథాన్ని లాగుతూ.. భక్తిపాటలు పాడుతూ గిరిప్రదక్షిణ నిర్వహించారు. గోకులం, ఎనుములపల్లిక్రాస్, పెట్రోల్ బంక్, పెద్దకమ్మవారిపల్లి చింతతోపు, గోవిందపేట, శివాలయం వీధి, గోపురంరోడ్డు మీదుగా సాగి తిరిగి గణేశ్‌గేటు వద్దకు చేరుకన్నారు. మహా మంగళహారతితో గిరిప్రదక్షిణ ముగించి భక్తులకు ప్రసాదాలు పంచారు. మూడు గంటలపాటు సాగిన ఈ కార్యక్రమంలో వృద్ధులు సైతం పాల్గొన్నారు.



గిరిప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

గొడవలకు దిగితే చర్యలు



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం

ధర్మవరం, మార్చి 24: రౌడీషీటర్లు ఎవరైనా చిన్నపాటి గొడవలకు దిగినా కఠిన చర్యలు తప్పవని వన్‌టౌన్ సీఐ సుబ్రమణ్యం, టూటౌన్ సీఐ అశోక్‌కుమార్ హెచ్చరించారు. పట్టణంలోని వన్‌టౌన్, టూటౌన్ పోలీస్‌స్టేషన్లలో సీఐలు సుబ్రమణ్యం, అశోక్‌కుమార్‌లు రౌడీషీటర్లను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. సార్వత్రిక ఎన్నికలలో భాగంగా రౌడీషీటర్లు ఎక్కడైనా గొడవలు పడినా, సృష్టించినా చర్యలు తీసుకుంటామన్నారు. రౌడీషీటర్లపై పోలీసుల నిఘా నిరంతరం ఉంటుందన్నారు. అదే విధంగా టీ కేఫ్‌లు, డాబాలు, హోటళ్లలో తనిఖీలు చేశామన్నారు. ఎన్నికల సమయంలో కేఫ్‌లలో గుంపులుగా ఉండటం వల్ల రాజకీయంగా గొడవల జరిగే ప్రమాదముందని, అందుకే టీకేఫ్‌లలో ఎక్కువమంది కూర్చోకుండా చూసుకోవా లని యజమానులకు సీఐలు ఆదేశించారు.

క్షయ నిర్మూలన అందరి బాధ్యత

● డిప్యూటీ డీఎంహెచ్ఓ నాగేంద్రనాయక్

కదిరిఅర్బన్: క్షయవ్యాధి నిర్మూలన అందరి బాధ్యత అని డిప్యూటీ డీఎంహెచ్ఓ నాగేంద్రనాయక్ పిలుపునిచ్చారు. ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా పట్టణంలో ఆయన వైద్యసిబ్బందితో కలిసి ర్యాలీ చేశారు. పలు ప్రధాన వీధుల గుండా ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండువారాల పాటు దగ్గు, జ్వరం ఉన్నవారు క్షయపరీక్షలు చేయించుకోవాలన్నారు. వ్యాధి నిర్ధారణ అయినవారు క్రమం తప్పకుండా మందులు వాడితే నయమవుతుందన్నారు. అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా క్షయ పరీక్షలు చేస్తారని, మందులు అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ హుస్సేన్, వైద్యులు ప్రమీల, ఫక్రుద్దీన్, టీబీ యూనిట్ సూపర్‌వైజర్ శ్రీనివాసులు, ల్యాబ్ టెక్నీషియన్ శిరీషా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మవరం: పట్టణంలో క్షయవ్యాధి నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వాస్పత్రి నుంచి మొదలైన ర్యాలీ పలు ప్రధాన వీధుల గుండా సాగింది. ఆస్పత్రి వైద్యురాలు మాధవి, టీబీ యూనిట్ సూపర్‌వైజర్లు కిష్టప్ప, ఎరుకులప్ప, చంద్రకళ, ల్యాబ్ టెక్నీషియన్ జయమ్మ, స్టాఫ్ నర్సులు , బత్తలపల్లి ఆర్డీటీ విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

ఓబుళదేవరచెరువు: ప్రపంచ క్షయవ్యాధి నిర్మూలన దినోత్సవం సందర్భంగా మండలకేంద్రంలో వైద్యసిబ్బంది ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి భానుప్రకాష్‌నాయక్ మాట్లాడుతూ ఏవ్యాధికైనా ముందస్తు నివారణ చర్యలు ముఖ్యమన్నారు. క్షయ రహిత సమాజానికి ప్రతి ఒకరు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ కమలరోహిత్, సిబ్బంది సుభాషిణీ, దిల్‌షాద్, విజయకుమారి, వరలక్ష్మి, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

గాండ్లపెంట: క్షయవ్యాధి నిర్మూలన దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో వైద్యాధికారి మహేశ్వర్ మారుతీ ఆధ్వర్యంలో సిబ్బంది ర్యాలీ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రి నుంచి ప్రారంభమైన ర్యాలీ పురవీధుల్లో సాగింది. అనంతరం నాలుగురోడ్ల కూడలిలో మానవహారంగా ఏర్పడ్డారు. క్షయవ్యాధిని 2025 నాటికి పూర్తిగా అంతం చేయాలని నినాదాలు చేశారు. సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.



కదిరి పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, వైద్య సిబ్బంది



ధర్మవరంలో ..

కొండకు చేరిన కాటమయ్యస్వామి ఉత్సవమూర్తి

బత్తలపల్లి, మార్చి24: మండలంలోని సంజీవపురం కాటమయ్యస్వామి ఉత్సవాలలో భాగంగా రెండో రోజైన ఆదివారం సమీప గ్రామాల ప్రజలు పన్నేరపు బండ్లు కట్టారు. ఈ బండ్లలో కొండవద్దకు చేరుకుని స్వామి వా రికి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం నిర్వహించారు. అనంతరం రాత్రి ముష్టూరు గ్రామంలో కాటమయ్య స్వామి ఉత్సవ మూర్తిని రకరకాల పూలతో అలంకరించారు. తర్వాత ఉరేగింపుగా కొండకు తీసుకొచ్చారు. భక్తులు అదిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

విద్యార్థిని ఆత్మహత్య

బత్తలపల్లి, మార్చి24: మండలంలోని కోడేకండ్ల గ్రామంలో ఆదివారం ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. కోడేకండ్ల గ్రామానికి చెందిన చేన్నకేశవనాయుడు, భాగ్యలక్ష్మిల చిన్న కుమార్తె పూర్ణిమ (17) పీలేరులో డిప్లొమ చదువుతోంది. కాగా గత ముడు నెలలుగా అనారోగ్యంతో బాధపడుతోంది. ప్రస్తుతం ఇంటి వద్దే ఉంటున్న ఈమె ఆదివారం తీవ్ర మనస్థాపానికి గురై ఇంటిలో ఎవరూ సమయంలో ఫ్యాన్‌కి ఉరి వేసుకుంది. తోటకు వెళ్లిన కుటుంబ సభ్యులు ఇంటికి వచ్చి చూడగా పూర్ణిమ ఫ్యానుకు వేళాడుతూ కనిపించింది వెంటనే ఆమెను కిందికి దించి చూడగా అప్పటికే మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

నేడు పల్లె సింధూరారెడ్డి ప్రచారం

కొత్తచెరువు, మార్చి 24: పుట్టపర్తి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి పల్లెసింధూరారెడ్డి సోమవారం మండలంలోని కేశాపురం, కొడపగానిపల్లి పంచాయతీలలో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు మండల కన్వీనర్ అడ పా ల రామకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మ ధ్యాహ్నం 3గంటలకు ప్రచారం ఉంటుందని, కావున టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎ త్తున తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

ఘనంగా మట్టల ఆదివారం

పుట్టపర్తి రూరల్, మార్చి 24: గుడ్‌ఫ్రైడే, ఈస్టర్ పండుగలకు ముందు జరుపుకునే మట్టల ఆదివారాన్ని స్థానిక కర్నాటకనాగేపల్లి చర్చిలో క్రైస్తవులు ఘనంగా ని ర్వహించారు. ఈమేరకు తొలుత చర్చిలో ప్రత్యేక ప్రార్థన లు చేశారు. అనంతరం యేసు మరణం, పునరుత్థానం, శి లువలో యేసు పడిన శ్రమలను పురవీధులలో తిరిగి తెలియజేశారు. పాస్టర్ అరుణ్‌కుమార్ భక్తులకు తన ఆధ్యాత్మిక ప్రసంగం వినిపించారు.

ఓబుళదేవరచెరువు: మండలకేంద్రంలోని సీఅండ్ ఐజీ మిషన్ చర్చిలో మట్టల ఆదివారాన్ని ఘనంగా నిర్వహించారు. క్రైస్తవులు మట్టలు పట్టుకుని చర్చిచుట్టూ ప్రదర్శనలు చేశారు. హోసన్నా జయం అంటూ నినాదాలు చేశారు. ప్రత్యేక గీతాలు ఆలపించారు. మట్టల ఆదివారం విశిష్టత ను చర్చిఫాదర్ డాక్టర్ రెవరెండ్ జయానందం వివరించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో చర్చి కార్యదర్శి దార్ల రాజశేఖర్, సభ్యులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలో కదిరి టైటాన్స్ జట్టు విజయం

కదిరిఅర్బన్, మార్చి 24: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో ఆదివారం జరిగిన క్రికెట్ పోటీలో కదిరి లయన్స్ జట్టుపై కదిరి టైటాన్స్‌జట్టు విజయం సాధించినట్లు క్రికెట్ కోచ్ నజీర్ తెలిపారు. మొదటి బ్యాటింగ్ చేసిన లయన్స్‌జట్టు 136 పరుగులకు ఆలౌట్ అయ్యారు. ఆ తరువాత బ్యాటింగ్ చేసిన టైటాన్ జట్టు మూడు వికెట్ల తేడాతో విజయం సాధించారు. విన్నర్ జట్టును సీనియర్ క్రీడాకారులు అభినందించారు.

మృతుడి కుటుంబానికి పల్లె పరామర్శ

ఓబుళదేవరచెరువు, మార్చి 24: మండలంలోని నాయనకోటకు చెందిన టీడీపీ కార్యకర్త మునెప్ప(44) శస్త్రచికిత్స వికటించి శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి ఆదివారం ఫోన్‌లో మృతుడి భార్యను పరామర్శించారు. మాజీ కన్వీనర్ రాజారెడ్డి, ఆర్ఎంపీ జాకీర్, బీసీసెల్ ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, శంకర్, భాస్కర్, చంద్ర, బాలకృష్ణారెడ్డి, వెంకటశివ, నారాయణ, గంగులప్ప, కేశవ తదితరులు మునెప్ప మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

చికిత్స పొందుతున్న మహిళకు పరామర్శ

ఎద్దులవాండ్లపల్లికి చెందిన ఎస్సీసెల్ నాయకుడు గంగాధర్ కుమార్తె భాగ్యశ్రీని మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి ఆదివారం పరామర్శించారు. అనంతపురంలో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆమెను పల్లె పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

ఇద్దరికి రిమాండ్

నల్లమాడ, మార్చి 24: మండలంలోని బసిరెడ్డిపల్లిలో నాటుసారా అమ్ముతున్న అమరమ్మ, సోమశేఖర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్‌ఐ రమేష్‌బాబు ఆదివారం తెలిపారు. తమకు వచ్చిన సమాచారం మేరకు బసిరెడ్డిపల్లి సమీపంలో తనీఖీలు చేపట్టామని, అందులో అమరమ్మ, సోమశేఖర్ నుంచి ఒక్కొక్కరి వద్ద నాలుగు లీటర్లు చొప్పున నాటు సారా పట్టుకున్నామని అన్నారు. అనంతరం కేసు నమోదు చేసి, కదిరి కోర్టుకు రిమాండ్‌కు పంపామన్నారు. తనిఖీల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాక్టర్ ట్రాలీ టైర్లు దహనం

ముదిగుబ్బ, మార్చి24: మండలంలోని రాళ్ల అనంతపురం క్రాస్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు రోడ్డు పక్కన ఉన్న చెత్తకు నిప్పు పెట్టారు. మంటలు సమీపంలోని తోట వరకు పాకి అక్కడ నిలిపిన ట్రాక్టర్‌కు సోకాయి. దీంతో ట్రాలీ టైర్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. వ్యవసాయ పనుల కోసం ట్రాక్టర్ ట్రాలీని తోటలో ఉంచామని, గుర్తు తెలియని వ్యక్తులు రోడ్డు పక్కన ఉన్న చెత్తకు శనివారం నిప్పు పెట్టారని, మంటలు ట్రాక్టర్ ట్రాలీకి అంటుకుని టైర్లు పూర్తిగా కాలిపోయాయని బాధితుడు గోపాల్‌రెడ్డి వాపోయారు. ఆదివారం తోటలోకి వెళ్లి చూడగా టైర్లు కాలిపోయి ఉన్నాయన్నారు. దాదాపు 30 వేల దాకా నష్టం వాటిల్లిందని అతడు పేర్కొన్నాడు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హిందూపురం అర్బన్, మార్చి 24: మండల పరిధి లోని తూమకుంట సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణం గా సోమవారం పలు గ్రామాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉన్నట్లు ఏఈఈ జబీవుల్లా ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని గోళ్ళాపురం, తూమకుంట, సంజీవరాయనపల్లి, సంతేబిదనూరు, రామచంద్రాపురం, హనుమేపల్లి, కిరికెర, అప్పలకుంట, బసవనపల్లి, జుమాకులపల్లి, బేవనహళ్ళి, చౌళూరు, తుంగేపల్లి, దేవరపల్లి గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

వైద్యశిబిరానికి స్పందన

పెనుకొండ, మార్చి 24: స్థానిక ఘనగిరి విద్యానికేతన్ పాఠశాలలో ఆదివారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మూర్ఛవ్యాధి వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. శిబిరానికి వచ్చిన రోగులకు హిందూపురం ప్రభుత్వాసుపత్రి వైద్యులు రోహిల్‌కుమార్, బెంగళూరుకు చెందిన అక్షయ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యురాలు నీలేఖ్య, డాక్టర్ రాణి, 23మంది రోగులను పరీక్షించి చికిత్సలు నిర్వహించారు. జేవీవీ జిల్లా కార్యదర్శి హరి, జోనల్ అధ్యక్షులు నబి తదితరులు పాల్గొన్నారు.

క్షయవ్యాధిపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

హిందూపురం అర్బన్, మార్చి 24: క్షయవాధి నివారణపై అవగాహన ర్యాలీని ఆదివారం పట్టణంలో నిర్వహించారు. హిందూపురం టీబీ యానిట్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ప్రపంచ క్షయవాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ర్యాలీ చేపట్టారు. టీబీ వ్యాధి సోకిన వ్యక్తి లక్షణాలు వివరించారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం ఉండటం, ఆకలి లేకపోవడం, బరువు తగ్గిపోవడం, గళ్లలో రక్తం పడటం, రాత్రిపూట చెమటతో కూడిన జ్వరం రావడం, ఛాతీలో నొప్పిరావడం క్షయ వ్యాధి లక్షణాలన్నారు. ఈ లక్షణాలు ఉన్న వారు హిందూపురం ప్రభుతాసుపత్రి టీబీ యూనిట్ గళ్ల పరీక్ష చేయించుకోవాలన్నారు. మందులను ఉచితంగా అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో టీబీ యూనిట్ సూపర్‌వైజర్ గౌస్‌పీర్, ట్యాబ్ సూపర్‌వైజర్ రవికుమార్‌రెడ్డి, ఎంపీహెచ్ఎస్ నాగమణి, పవిత్ర, టీబీ హెచ్‌వీ తనూజ, ల్యాబ్ టెక్నీషియన్లు, ఏఎన్ఎంలు, ఆషా వర్కర్‌లు పాల్గొన్నారు.

అంబికాకు న్యాయం చేయండి

పలువురి డిమాండ్

హిందూపురం, మార్చి 24: తెలుగుదేశం పార్టీలో కీలకంగా వ్యవహరిస్తున్న పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబికా లక్ష్మీనారాయణకు అధిష్టానం న్యాయం చేయాలని టీడీపీ నాయకులతో పాటు వాల్మీకులు డిమాండ్ చేశారు. వారు ఆదివారం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అంబికా లక్ష్మీనారాయణ పార్టీ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని పేర్కొన్నారు. వాల్మీకులంతా టీడీపీవైపే ఉన్నారని ఇప్పటి వరకు తెలుగుదేశం పార్టీలో వాల్మీకులకు ఎమ్మెల్యే కానీ ఎంపీ కానీ ఇవ్వలేదన్నారు. కావున అంబికాకు ఎంపీ టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అధిష్టానం ఆదిశగా ఆలోచించాలని, స్థానిక ఎమ్మెల్యే బాలకృష్ణ న్యాయం చేయాలని కోరారు.

పేకాడుతున్న18 మంది అరెస్ట్


పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

హిందూపురం, మార్చి 24: మండంలోని మలగూరు సమీపంలో పేకాట స్థావరంపై జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం దాడులు చేశారు. ఈ దాడుల్లో పేకాడుతున్న 18 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.68,300 నగదుతో పాటు 13 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు.. స్వాధీనం చేసుకున్న వాహనాలను, పేకాడుతున్న వారిని అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. వారివద్ద ఉన్న 17 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇలా ఉంటే పేకాట స్థావరంపై దాడి చేసినపుడు అక్కడ కొంత మంది అధికార పార్టీ నాయకులు కూడా ఉన్నట్లు సమాచారం. వారిని తప్పించినట్లు తెలిసింది. నగదు కూడా పెద్ద మొత్తంలో పట్టుబడిందని కొంత మంది పోలీసులే చర్చించుకోవడం కనిపించింది.

కర్ణాటక మద్యం స్వాధీనం

గుడిబండ, మార్చి 24: మండలంలోని కరికెర చెక్‌పోస్టువద్ద కర్ణాటక మద్యం తీసుకొస్తున్న వ్యక్తిని అరెస్ట్‌చేసి, అతడి వద్ద నుంచి 300 కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ మునిప్రతాప్ తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో కర్ణాటక మద్యం మండలానికి రాకుండా ప్రత్యేక నిఘా ఉంచినట్లు ఎస్ఐ తెలిపారు. పట్టుబడిన మద్యం విలువ సుమారు రూ.19వేలు ఉంటుందని తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, మార్చి 24: మండలంలోని ఎగువ గంగంపల్లికి చెందిన సాయికిరణ్ క్రిమిసంహారక మందు తాగి ఆదివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గ్రామానికి చెందిన వెంకటప్ప కుమారుడైన సాయికిరణ్ పంట పొలాలకు ఉపయోగించే క్రిమిసంహారక మందు తాగి అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబసభ్యులు గమనించి వెంటనే గోరంట్ల ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చారు. డాక్టర్ హరీష్ చికిత్సలు అందించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం 108లో హిందూపురం ఆసుపత్రికి తరలించారు. వివాహ విషయమై కుటుంబ సభ్యుల మధ్య నెలకొన్న వివాదంతో తీవ్ర మనస్థాపానికి గురైన అతడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు గ్రామస్థులు తెలిపారు.

పాఠశాలలో ఐఎఫ్‌పీ ప్యానల్ ధ్వంసం

లేపాక్షి, మార్చి 24: స్థానిక ఓరియంటల్ ప్రభుత్వ పాఠశాలలో ఆదివారం కొందరు విద్యార్థులు ఐఎఫ్‌పీ ప్యానల్‌ను పగులగొట్టారు. దీనిపై పాఠశాల హెచ్‌ఎం గిరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీసీ కెమెరాల ద్వారా గుర్తించి వారిపై చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

కమనీయం... కనుమ నారసింహుడి కల్యాణం


నరసింహస్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు

చిలమత్తూరు, మార్చి 24: మండల ప్రజల ఆరాధ్యదైవమైన కనుమ లక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. భక్తజనుల గోవింద నామస్మరణ, వేదపండితుల మంత్రోచ్ఛారణతో స్వామి కల్యాణం నిర్వహించారు. బ్రహోత్సవాల్లో స్వామి వారి కల్యాణోత్సవం అత్యంత ప్రధానమైనది. ఈ కార్యక్రమాన్ని వీక్షించడానికి భక్తులు ఆలయానికి పోటెత్తారు. అర్చకులు ఉదయం నుంచి స్వామి వారికి సుప్రభాత సేవ, అభిషేకాలు, అర్చనలు, హోమాలు నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత స్వామి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి వేదికపై ఆశీనులను చేశారు. అనంతరం బ్రాహ్మణుల వేదమంత్రోచ్ఛారణతో కళ్యాణోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామి వారి కల్యాణోత్సవానికి హాజరైన భక్తులకు ఆలయంలో భక్తుడు దివాకరరెడ్డి కుటుంబ సభ్యులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

నేడు బ్రహ్మరథోత్సవం

బ్రహోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామి వారి బ్రహ్మరథోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయకమిటీ సభ్యులు తెలిపారు. మధ్యాహ్నం 1.30 గంటలకు మిథున లగ్న పుష్కరాంశంలో రథోత్సవం ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. రథంలో ఆశీనులైన స్వామి ప్రధాన వీధుల గుండా ఊరేగుతారు. ఈ ఉత్సవానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరానున్నారు. అందుకు తగిన ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. పోలీసులు గట్టి భద్రతా చర్యలు చేపట్టారు.

బీకేకి ఘన స్వాగతం


వైజంక్షన్‌లో బీకేకి గజమాలవేసి స్వాగతం పలుకుతున్న టీడీపీ నాయకులు

పెనుకొండ/గోరంట్ల, మార్చి 24: తెలుగుదేశం పార్టీ హిందూపురం పార్లమెంట్ అభ్యర్థిగా ప్రకటించిన తరువాత మొదటిసారిగా ఆదివారం పెనుకొండకు వచ్చిన బీకే పార్థసారథికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున ఘనస్వాగతం పలికారు. ఆయన ఆదివారం ఉదయం బెంగళూరు నుంచి పెను కొండకు చేరుకున్నారు. స్థానిక శ్రీకృష్ణ దేవరాయల వైజంక్షన్ వద్ద నియోజ కవర్గంలోని ఐదు మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వేలాది మంది ఆయన్ను కలిసి పుష్ప గుచ్ఛాలు అందజేసి గజమాల వేసి స్వాగతం పలికారు. స్వీట్లు తినిపించి అభినం దనలు తెలిపారు. అనంతరం బాణసంచా పేల్చుతూ కార్లు, ద్విచక్రవాహనాలతో వైజంక్షన్ నుంచి భారీ ఎత్తున ర్యాలీగా పార్టీ కార్యాలయం చేరుకున్నారు. బీకే పార్థసారథికి స్వాగతం పలుకడానికి గోరంట్ల మండలం నుంచి పార్టీ శ్రేణులు పెద్దఎత్తున ఆదివారం పెనుకొండకు తరలి వెళ్లారు. టీడీపీ మండల కార్యదర్శి అశ్వత్థరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు ద్విచక్రవాహనాల్లో ర్యాలీగా వెళ్లారు. మండల కన్వీనర్ సోముశేఖర్, జిల్లా కార్యదర్శి కొత్తపల్లి నరసింహులు, నీలకంఠారెడ్డి, బెల్లాలచెరువు చంద్ర, అజంతుల్లా తదితరులు ప్రత్యేక వాహనాల్లో వెళ్లారు. మైనార్టీ యువ నాయకుడు ఉమ్మర్ ఖాన్ ముస్లింలతో వెళ్లి బీకేను ముస్లింటోపీతో స్వాగతించారు.


ద్విచక్రవాహనాల్లో ర్యాలీగా వెళ్తున్న టీడీపీ గోరంట్ల నాయకులు

అవోపా కార్యవర్గం ఎంపిక


అవోపా నూతన కార్యవర్గ సభ్యులు

హిందూపురం అర్బన్, మార్చి 24: ఆర్యవైశ్య అఫిషియల్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (అవోపా) పట్టణ నూతన కార్యవర్గాన్ని ఆదివారం డీబీ కాలనీలోని అష్ట లక్ష్మీ ఆలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కేవీ ద్వారకనాథ్, ఉపాధ్యక్షుడిగా జీ వెంకటేష్‌ప్రసాద్, కార్యదర్శిగా సుంకు శ్రీనివాసమూర్తి, సంయుక్త కార్యదర్శిగా ఎం నాగరాజు, కోశాధికారిగా వైవీ నాగరాజును ఎన్నుకున్నట్టు వారు తెలిపారు. ఎడ్యుకేషన్ కమిటీ ఇన్‌చార్జ్‌గా ఎన్‌వీ మురళీధర్‌లను ఎన్నుకున్నారు. వారు రెండు సంవత్సరాలు పదవిలో కొనసాగుతారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన వారు మాట్లాడుతూ తమకు బాధ్యతాయుతమైన పదవులు అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

మానవ హక్కుల సంరక్షణ సమితి సభ్యుల ఎంపిక


సమితి పదాధికారులను సన్మానిస్తున్న సంస్థ సభ్యులు

పావగడ, మార్చి 24: రాష్ట్ర మానవ హక్కుల సంరక్షణ సమితి వైఎన్ హొసకోట మండల అధ్యక్షుడిగా బల్లెపల్లి అశోక్‌ను, నగర అధ్యక్షుడిగా రామాంజినప్పను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తాలూకా అధ్యక్షుడు మల్లికార్జున ఆదివారం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక అణచివేతకు గురైన మహిళలు, చిన్నపిల్లలు, పేదలకు సామాజిక న్యాయం కల్పించడానికి తమ సంస్థ ఎప్పుడు ముందంజలో ఉంటుందని తెలియజేశారు. చట్టబద్ధంగా ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందజేయడానికి కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. అధికారులు ఈవిషయం పట్ల నిర్లక్ష్యధోరణితో వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకొనేలా సంబంధిత కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా సమితి తాలూకా ఉపాధ్యక్షుడు మంగళవాడ మంజునాథ్, ప్రధానకార్యదర్శి పృథ్వీరాజ్, జాయింట్ కార్యదర్శి గోపాల్ తదితరులు ఏకగ్రీవమైన వ్యక్తులను అభినందించారు.

సొంత గూటికి చేరిన నాగరాజు

పెనుకొండ, మార్చి 24: రొద్దం మండలం రాచూరుకు చెందిన నాయకుడు నాగరాజు మళ్లీ టీడీపీలో చేరాడు. గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త అయిన నాగారాజు రెండు రోజుల కిందట రాష్ట్ర మంత్రి, వైసీపీ పెనుకొండ అభ్యర్థి ఉషశ్రీ చరణ్ సమక్షంలో వైసీపీలో చేరాడు. అయితే ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి సమక్షంలో మళ్లీ టీడీపీ పార్టీలోకి చేరాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ నాయకులు ఒత్తిడితో ఆ పార్టీలో చేరానని అక్కడ మనసు ఒప్పక మళ్లీ టీడీపీలోకి వచ్చానన్నారు. పార్టీ విజయానికి శక్తి వంచన లేకుండా కృషిచేస్తానన్నారు.

పార్థసారథికి సన్మానం

రొళ్ల, మార్చి 24: పెనుకొండలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఆ పార్టీ హిందూపురం పార్లమెంటు అభ్యర్థి బీకే పార్థసారథిని రాష్ట్ర వక్కలిగ కన్వీనర్ వీఎం పాండురంగప్ప, జిల్లా కార్యదర్శి రవిభూషణ్, మాజీ ఎమ్మెల్యే ఈరన్న, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్ తదితరులు శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి కేఎన్ పల్లి సురేష్, నాయకులు రామకృష్ణయాదవ్, రామన్న, గుడ్డగుర్కి మారుతి, రవి తదితరులు పాల్గొన్నారు.

'పశువుల పేరు చెప్పి మోసం తగదు'

పావగడ, మార్చి 24: వేలాది మూగజీవాలకు ప్రతి రోజూ పశుగ్రాసం అందజేస్తామని వివిధ సంఘ సంస్థల నుంచి జపానందస్వామి రూ.లక్షల్లో వసూలు చేస్తున్నారని హెల్ప్ సొసైటీ అధ్యక్షుడు మానం శశికిరణ్ తీవ్రంగా ఆరోపించారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయన ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎంతో ప్రధానమైన ఇన్ఫోసిస్ సంస్థ, విశ్వసంస్థ ఇతర రాజకీయ నాయకుల అండదండలతో పశుగ్రాస కేంద్రాలను నామమాత్రంగా ఏర్పాటు చేశారని అన్నారు. అయితే రోజుకు నూరు నూటాయాభై పశువులకు పశుగ్రాసం అ ందించి 1700 పశువులకు అందిస్తున్నట్లు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేసుకోవడం దారుణం అన్నారు. ప్రభుత్వం చర్యలు తీసుకొని పశుగ్రాస కేంద్రాలను నిర్వహిస్తే అటు సంస్థలకు, ఇటు ప్రభుత్వానికి ఎంతో మేలు జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

విద్యార్థిని ఆత్మహత్య

బత్తలపల్లి, మార్చి24: మండలంలోని కోడేకండ్ల గ్రామంలో ఆదివారం ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. కోడేకండ్ల గ్రామానికి చెందిన చేన్నకేశవనాయుడు, భాగ్యలక్ష్మిల చిన్న కుమార్తె పూర్ణిమ (17) పీలేరులో డిప్లొమ చదువుతోంది. కాగా గత మూడు నెలలుగా అనారోగ్యంతో బాధపడుతోంది. ప్రస్తుతం ఇంటి వద్దే ఉంటున్న ఈమె ఆదివారం తీవ్ర మనస్థాపానికి గురై ఇంటిలో ఎవరూ సమయంలో ఫ్యాన్‌కి ఉరి వేసుకుంది. తోటకు వెళ్లిన కు టుంబ సభ్యులు ఇంటికి వచ్చి చూడగా పూర్ణిమ ఫ్యాను కు వేళాడుతూ కనిపించింది వెంటనే ఆమెను కిందికి దించి చూడగా అప్పటికే మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రాష్ట్రం బాగుండాలంటే టీడీపీని ఆదరించాలి


మాట్లాడుతున్న సవిత

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత

హిందూపురం అర్బన్, మార్చి 24: టీడీపీ పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత ఆదివారం పరిగి మండలంలో విస్తృత ప్రచారం చేపట్టారు. పరిగి మండలంలోని గొల్లపల్లి, బీచిగానపల్లి, వంగలపల్లి, శీగుపల్లి, గణపతిపల్లి, పైడేటిలలో ఆమె ప్రచారం సాగించారు. ప్రతి గ్రామంలోను ప్రజలు ఆమెకు ఘనస్వాగతం పలికారు. మోద గ్రామం నుంచి దివ్యాంగుడు మూడు చక్రాల వాహనంలో తరలి వచ్చి సవిత ర్యాలీలో పాల్గొన్నాడు. అతడిని ఆమె ఆప్యాయంగా పలకరించారు. క్రిస్టియన్ సభ్యులు సవితను సన్మానించి, ఆమె విజయం కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా సవిత మాట్లాడుతూ... యువతకు జాబు రావాలన్నా, రాష్ట్రానికి పరిశ్రమలు రావాలన్నా టీడీపీ అధికారంలోకి రావాలని పిలుపునిచ్చారు. పది కుటంబాలు వైసీపీ నుంచి టీడీపీలోకి చేరగా, సవిత కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీచిగానపల్లి సర్పంచ్ బాలాజీ, మాజీ జడ్పీటీసీలు ధనాపురం సూరి, నంజుండప్ప, మాజీ ఎంపీపీ కాలవపల్లి సత్యనారాయణ, మాజీ ఎంపీపీ క్రిష్ణమూర్తి, వడ్డె సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ హనుమయ్య, పెద్దరెడ్డిపల్లి సోమప్ప, మాజీ సర్పంచ్ నాగప్ప, తిప్పారెడ్డి, నారాయణరెడ్డి వేలాది మంది ప్రజలు నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు.

పెనుకొండ టౌన్ : ఒక్క చాన్స్‌తో ముఖ్యమంత్రి అయిన జగన్మోహన్‌రెడ్డి అరాచకాలు, అప్పులతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశాడని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత అన్నారు. ఇప్పుడు రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టీడీపీ అధినేత చంద్ర బాబు ముఖ్యమంత్రి కావాలన్నారు. ఆమె ఆదివారం పెనుకొండ పట్టణంలోని బోయగేరిలో ఇంటింటి ప్రచారం నిర్వ హించారు. భర్త వెంకటేశ్వరరావు, టీడీపీ శ్రేణులతో కలిసి ప్రచారం సాగించారు. వాల్మీకి విగ్రహానికి పూలమాలలువేసి ప్రచారం ప్రారంభించారు. సూపర్‌సిక్స్, మినీ మేనిఫెస్టో పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వాసుదేవరెడ్డి, త్రివేంద్ర, బాబిరెడ్డి, బాబుల్‌రెడ్డి,మాజీ సర్పంచ్ అశ్వర్థప్ప, మహంత్, జప్రుల్లాఖాన్, గుట్టూరు సూరి, సుబ్రహ్మణ్యం, కోనాపురం నారాయణస్వామి, రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

బీసీల అణచివేతే జగన్ లక్ష్యం

- టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్

మడకశిరటౌన్, మార్చి 24: తెలుగుదేశం పార్టీకి బడుగు బలహీన వర్గాలు అండగా ఉంటారని, వారిని అణచివేయడమే ముఖ్యమంత్రి జగన్ లక్ష్యంగా పెట్టుకున్నారని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్ అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. తన సొంత జిల్లాలోని బీసీల భూముల రికార్డులు తారుమారు చేసి, వారి మృతికి కారణమైన వైసీపీ నేతలపై ఎందుకు చట్టప్రకారం చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. తమ భూములను వైసీపీ నేతలు లాక్కోవడంతో రాజంపేట నియోజకవర్గంలో పాలసుబ్బయ్య, పద్మావతి, వారి కుమార్తెలుజీవనోపాధి లేక చివరకు ఆత్మహత్యలు చేసుకున్నారని అన్నారు. అదేవిధంగా నందం సుబ్బయ్యను హత్యచేసిన వారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదన్నారు. రాష్ట్రంలో బీసీలకు అండగా ఉండాలని వారికి అన్నివిధాలా రక్షణ కల్పించాలని మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని తీసుకొచ్చారన్నారు. జగన్ అక్రమాలను అవినీతిని అణచివేసేందుకు వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో టీడీపీ నాయకులు ఆదినారాయణ, రాజగోపాల్, సురేష్, సుబ్బరాయుడు, నాగరాజు, కిష్టప్ప, నాగరాజు, మంజునాథ్, కోట్ల రంగేగౌడ్ తదితరులు ఉన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న సునీల్‌కుమార్

ఘనంగా మట్టల ఆదివారం


పురంలో ప్రార్థనలు నిర్వహిస్తున్న దృశ్యం

హిందూపురం అర్బన్, మార్చి 24: క్రైస్తవులు పవిత్రంగా భావించే మట్టల ఆదివారాన్ని పట్టణంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక సీఅండ్ఐజీ కాంపౌండ్ చర్చి ఆధ్వర్యంలో పట్టణం వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ప్రతేక ప్రార్థనలు చేసి, పాటలను ఆలపించారు. ప్రపంచంలోని ప్రజలందరి క్షేమం కోసం యేసు క్రీస్తు గుడ్ ఫ్రైడే నాడు శిలువతో మరణిస్తాడని తెలిపారు. ఆ తరవాత వెంటనే వచ్చే అదివారమే మట్టల ఆదివారంగా జరుపుకుంటారన్నారు. పాస్టర్ రెవరెండ్ స్టీఫెన్‌రాజ్, సంఘం కార్యదర్శి నాగేంద్రకుమార్, కోశాధికారి విక్టర్ జాషువ,సంయుక్త కార్యదర్శి సాల్మన్‌రాజ్, జాయింట్ సెక్రెటరి ఆనంద్‌రాజ్, డికెన్ సభ్యులు జార్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ : స్థానిక బైబిల్ మిషన్ చర్చిలో పాస్టర్ సుధాకర్ ఆధ్వర్యంలో మట్టల ఆదివారం పండగ వేడుకలను ఘనంగా నిర్వహించారు.


పెనుకొండలో ఈతమట్టలతో ర్యాలీ నిర్వహిస్తున్నక్రైస్తవులు

బోర్డులు తొలగించారు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మడకశిర రూరల్, మార్చి 24: పట్టణంలోని నియోజకవర్గ స్థాయి పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాల కార్యాలయంపై ఉన్న వైఎస్ఆర్ బోర్డులను ఆ శాఖ అధికారులు తొలగించారు. 'కోడ్ వచ్చి వారమైనా తొలగని బోర్డులు' అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో ఆదివారం వచ్చిన వార్తకు ఎన్నికల అధికారులు స్పందించారు. పశుసంవర్థక శాఖ అధికారులకు నోటీసు ఇచ్చారు. వెంటనే స్పందించిన అధికారులు కార్యాలయంపై ఉన్న వైఎస్ఆర్ బోర్డులను తొలగించారు, అదే విధంగా కార్యాలయం ఎదుట ఉన్న శిలాఫలకాలపై రాజకీయ నాయకుల పేర్లు కనపడకుండా మూసివేశారు.

'ఓటు హక్కును వినియోగించుకోండి'


శెట్టిపల్లిలో గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

పెనుకొండ రూరల్, మార్చి 24 : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు తమ తమ ఓటు హక్కును ప్రశాంతంగా వినియోగించుకోవాలని సీఐ యుగంధర్ సూచించారు. మండలంలోని శెట్టిపల్లిలో ఆదివారం ఎస్ఐ రాజేష్ ఆధ్వర్యంలో పోలీసులు కవాతు, కార్డెన్ సర్చ్ నిర్వహించారు. ఎన్నికలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో భయం, ఆందోళన వీడి ఓటు హక్కును ప్రశాంతంగా వినియోగించుకునేందుకు తామున్నామని ధైర్యం కల్పించారు. ప్రశాంత ఎన్నికలకు సహకరించాలని కోరారు. ఎవరైనా ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం గ్రామంలో అనుమానం ఉన్న ఇళ్లలో పోలీసులు సోదాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఎస్ఎఫ్ జవాన్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గిరిప్రదక్షిణ


గిరిప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

పుట్టపర్తి, మార్చి 24: పట్టణంలో సత్యసాయి భక్తులు ఆదివారం గిరిప్రదక్షిణను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రాత్రి 7గంటల ప్రాంతంలో ప్రశాంతినిలయం గణేశ్ గేటు వద్ద సత్యసాయి రథాన్ని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం రథాన్ని లాగుతూ.. భక్తిపాటలు పాడుతూ గిరిప్రదక్షిణ నిర్వహించారు. గోకులం, ఎనుములపల్లిక్రాస్, పెట్రోల్ బంక్, పెద్దకమ్మవారిపల్లి చింతతోపు, గోవిందపేట, శివాలయం వీధి, గోపురంరోడ్డు మీదుగా సాగి తిరిగి గణేశ్‌గేటు వద్దకు చేరుకన్నారు. మహామంగళహారతితో గిరిప్రదక్షిణ ముగించి భక్తులకు ప్రసాదాలు పంచారు. మూడు గంటలపాటు సాగిన ఈ కార్యక్రమంలో వృద్ధులు సైతం పాల్గొన్నారు.

క్రీడాకారులకు సన్మానం

హిందూపురం, మార్చి 24 : ఫుట్‌బాల్ క్రీడలో జాతీయ స్థాయిలో రాణించిన పురానికి చెందిన క్రీడాకారులను సన్మానించారు. వారికి ఆదివారం జేవీఎస్ ఫంక్షన్‌హాల్‌లో జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అనీల్‌కుమార్ మాట్లాడుతూ... హిందూపురానికి చెందిన క్రీడాకారులు, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించడం గర్వంగా ఉందన్నారు. అసోసియేషన్ ఏర్పడిన తరువాత ఎంపికైన క్రీడాకారులకు అసోసియేషన్ తరుపున సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు. భవిష్యత్తులోనూ క్రీడాకారులకు అసోసియేషన్ తరుపున సహకారం ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఇర్షాద్‌అలీ, కోశాధికారి శేఖర్, కార్యదర్శి మహ్మద్ సలీం, విజయవాణి, శ్రీనివాసరెడ్డి, ఆజాన్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


ప్రతిభ చాటిన క్రీడాకారులతో అసోసియేషన్ సభ్యులు